PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 322 | విజయవాడ, శుక్రవారం 23 జూన్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 23 June 2023 | Rs

నేడు టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరు డి దేవానందరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2 నుంచి 10 వరకు నిర్వహించిన ఈ పరీక్షలకు 2,12,221 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలను www.bse.ap.gov.in ద్వారా తెలుసుకోవచ్చు.

వెంకట్‌తో కలిసి విల్లు ఎక్కుపెట్టిన వివిఎస్ఆర్

నిర్వాసితుల హక్కులు కాలరాస్తే ఊరుకోం

- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్
- పోలవరం పోరుకేక మహాపాదయాత్రకు సంఘీభావం

3

ఇంకా దొరకని 'టైటాన్' ఆచూకీ

బోస్టన్ : అట్లాంటిక్ మహాసముద్రంలో తప్పిపోయిన పర్యాటకుల మిని జలాంతర్గామి 'టైటాన్' ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు కొనసాగుతోంది. అమెరికా కోస్ట్ గార్డ్, కెనడా సైనిక విమానాలు, ఫ్రెంచ్ నౌకలు, టెలిగైడెడ్ రోబోలు భారీ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. సముద్రంలో సుమారు 4 కి.మీల లోతులో ఉన్న టైటానిక్ నౌక శకలాలను చూసేందుకు ఆదివారం బయలుదేరిన టైటాన్ కొన్ని గంటల్లోనే తప్పిపోయిన విషయం తెలిసిందే. భారత కాలమాన ప్రకారం, గురువారం సాయంత్రం 7.15నిమిషాల వరకే ఆక్సిజన్ సరిపోతుందని అంచనా. పాకిస్థాన్ బిలియనీర్ షెహజాదా దావూద్ (48), ఆయన కుమారుడు సులేమాన్ (19), బ్రిటిష్ వ్యాపారవేత్త హమీష్ హార్డింగ్, ఈ యాత్ర నిర్వాహకుడు స్టాక్టన్ రష్, ఫ్రెంచ్ మాజీ నావికా అధికారి పాల్ హెన్రీ ఈ జలాంతర్గామిలో ఉన్నారు.

పల్నాడు జిల్లా ముప్పాళ్లలో జోరు వర్షం

'నైరుతి' విస్తరణతో రాష్ట్రం తుళ్లింత

- నందిగామలో 108 మిల్లీమీటర్ల వర్షపాతం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నైరుతి రుతుపవనాలు గురువారం నాటికి రాష్ట్రం అంతటా విస్తరించాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ, మోస్తరు వర్షాలు కురిశాయి. భానుడి భగభగలతో విలవిల్లాడిన ప్రజానీకం వాతావరణ చల్లబడటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఐఎండి నివేదిక ప్రకారం..ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ఆవర్తనం కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి బిఆర్ అంబేద్కర్ తెలిపారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో గురువారం ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో 108 మిల్లీమీటర్లు, పల్నాడు జిల్లా దూళిపాళ్లలో 66, సత్తెనపల్లిలో 65, చాగల్లులో 59.5, కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో 49.75, ముప్పాళ్లలో 46 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు. శుక్రవారం పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం వుందని తెలిపారు.

పరిశ్రమలకు ప్రభుత్వ అండ

- రూ.1,425 కోట్లతో కంపెనీల నిర్మాణం ప్రారంభంలో సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. రూ.1,425 కోట్ల పెట్టుబడులతో చేపట్టనున్న పరిశ్రమలను గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ, విశ్వసముద్ర బయో ఎనర్జీ, సిసిఎల్ ఫుడ్ అండ్ బేవరేజస్ పరిశ్రమలకు శిలాఫలకం ఆవిష్కరించి వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థను ప్రారంభించారు. రూ.610 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న క్రిబ్‌కో ఎనర్జీలో రోజుకు 500 కిలోల బయో ఇథనాల్, 64 వేల టన్నుల కార్బన్‌డయాక్సైడ్, నాలుగు వేల టన్నుల డ్రైడ్ డిస్టిలరీ గ్రెయిన్స్‌ను ఉత్పత్తి చేయనున్నారు. నెల్లూరు జిల్లా సర్వేపల్లిలో రూ.315 కోట్ల పెట్టుబడితో ఇథనాల్ తయారీ పరిశ్రమ పెట్టనున్నారు. తిరుపతి జిల్లా వరదాయపాళెంలో రూ.400 కోట్ల పెట్టుబడితో కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ ఫుడ్, బేవరేజస్ పెట్టనున్నారు. ఏలూరు జిల్లా చింతలపూడిలో గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ కంపెనీ రూ.100 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుచేసిన 400 టన్నుల ఎడిబుల్ ఆయిల్ తయారీ పరిశ్రమనూ సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో 2,500 మందికి ఉపాధి అవకాశాలూ పెరుగుతాయని అన్నారు. ఏ సమస్య వచ్చినా ఫోన్‌కాల్ దూరంలోనే ఉంటామని పేర్కొన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్లో చేసుకున్న ఎంఒయులు కార్యరూపం దాలుస్తున్నాయని వివరించారు. కంపెనీల సహకారం ఇలాగే కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సిఎస్ జవహర్‌రెడ్డి, స్పెషల్ సిఎస్ కరికాల వలవన్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాతో బంధం బలోపేతం

- ఇకపై భారత్ ఫైటర్ జెట్‌లకు దేశీయంగానే ఇంజన్ల తయారీ
- వైట్‌హౌస్‌లో బైడెన్ దంపతులతో మోడీ భేటీ

వాషింగ్టన్ : ప్రధాని నరేంద్ర మోడీ అమెరికాలో పర్యటిస్తున్న వేళ ఇరుదేశాల మధ్య రక్షణ, వాణిజ్య రంగాల్లో పలు ఒప్పందాలు కుదిరాయి. తద్వారా ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత ధృడపరుచుకోవాలని ఇరు దేశాధినేతలు భావించారు.

తొలుత గురువారం ఉదయం వైట్‌హౌస్‌లో బైడెన్ దంపతులు ప్రధాని మోడీకి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. పలు కీలక ఒప్పందాలపై సంతకాలు చేశారు. తర్వాత ఇరువురు సంయుక్త పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. రక్షణ, సాంకేతికత, ఆరోగ్య, పర్యావరణ రంగాల్లో సహకారంపై పలు ఒప్పందాలు చేసుకున్నట్లు సంయుక్త ప్రకటన పేర్కొంది.

భారత సైనిక విమానాలకు జెట్ ఇంజన్లను దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు జనరల్ ఎలక్ట్రికల్ కంపెనీ (జిఇ)తో ఒప్పందం కుదిరింది. ఇకపై హెచ్‌ఎఎల్‌తో కలిసి ఇంజన్లు తయారుచేయనున్నామని, ఈ మేరకు అవగాహనా ఒప్పందంపై సంతకాలు జరిగినట్లు గురువారం కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. అమెరికా తయారు చేసే సాయుధ ఎంక్యూ-9బి సీ గార్డియన్ డ్రోణ్‌లను భారత్ కొనుగోలు చేయనుంది. ఈ మేరకు 31 డ్రోణ్‌ల కొనుగోలుకు 300కోట్ల డాలర్లతో ఒప్పందం కుదిరింది. అలాగే భారతీయులు హెచ్ 1బి వీసాల విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేలా బైడెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నారు. మోడీ పర్యటనా సమయంలోనే ఈ మేరకు ప్రకటన వెలువడే అవకాశం వుంది.

శ్వేతసౌధంలో బైడెన్ దంపతులకు బహుమతులు అందజేస్తున్న ప్రధాని మోడీ

ఈ గౌరవం భారతీయులందరిదీ

వైట్‌హౌస్ వద్ద బైడెన్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడిన మోడీ ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ అందచేస్తున్న సేవలను అభినందించారు. ఈనాడు ఇక్కడ అందిన గౌరవం 140కోట్ల మంది భారతీయులకు, 40లక్షల మంది ఇండియన్ అమెరికన్స్‌కి చెందుతుందని మోడీ వ్యాఖ్యానించారు. గతంలో అనేకసార్లు తాను వైట్‌హౌస్ సందర్శించానని, కానీ ఈసారి ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ కోసం వైట్‌హౌస్ ద్వారాలు తెరవడం ఇదే తొలిసారని అన్నారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఈ సంబంధాలకు మీరే అసలైన బలం అంటూ ఇండియన్ అమెరికన్స్‌ని ప్రశంసల్లో ముంచెత్తారు. మన వైవిధ్యతను చూసి రెండు దేశాలు గర్విస్తున్నాయని అన్నారు. అందరి ప్రయోజనాలు, అందరి సంక్షేమం అనే ప్రాథమిక సూత్రాన్ని తామిద్దరం నమ్ముతామని చెప్పారు. అనంతరం బైడెన్ కూడా మాట్లాడారు. ఇరు దేశాల మధ్య గల సారూప్యతలను నొక్కి చెప్పారు. రెండు గొప్ప దేశాలు, గొప్ప మిత్రులు, గొప్ప శక్తి సామర్థ్యాలు కలిగిన దేశాలు 21వ శతాబ్దాన్ని నిర్వచించగలవని అన్నారు.

శ్వేత సౌధంలో బైడెన్ దంపతులను కలుసుకున్న మోడీ వారికి తాను తెచ్చిన బహుమతులను అందచేశారు. ల్యాబ్‌లో కృత్రిమంగా తయారుచేసిన ఆకుపచ్చ డైమండ్‌ను అమెరికన్ ప్రథమ మహిళ జిల్ బైడెన్‌కు అందచేశారు. ఈ భేటీలో ఇరు దేశాలు తమ బంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది.

'నాడు-నేడు'గుంతలో పడి ఇద్దరు విద్యార్థులు దుర్మరణం

ప్రజాశక్తి - యాదమరి (చిత్తూరు జిల్లా)

'నాడు-నేడు' పనుల్లో భాగంగా పాఠశాలల్లో తవ్విన గుంతలను విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల అందులో పడి ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ఈ ఘటన యాదమరి మండలం తెల్లరాళ్లపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెల్లరాళ్లపల్లి గ్రామంలోని సతీష్ కుమార్, హేమావతి దంపతులిద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. రెండవ కుమార్తె పూర్ణి అదే గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతోంది. గురువారం సాయంత్రం తెల్లరాళ్లపల్లి గ్రామంలో కురిసిన వర్షానికి పాఠశాల ఆవరణం పూర్తిగా వర్షపు నీటితో నిండిపోయింది. వర్షం నిలిచిన తర్వాత పూర్ణి (9), మధన్ (3) ఇరువురూ ఆడుకునేందుకు పాఠశాల ఆవరణంలోనికి వెళ్లారు. అయితే నాడు-నేడు పనుల్లో భాగంగా తీసిన గుంతల్లో వారిరువురూ పడి చనిపోయారు.

అడుగడుగునా విద్యాశాఖ నిర్లక్ష్యం

ఆరు నెలల క్రితం నాడు -నేడు పనులు చేపట్టేందుకు తీసిన గోతులను అధికారులు అలాగే వదిలేశారు. పాఠశాల ఆవరణంలోనే గ్రామ సచివాలయం కూడా ఉంది. పాఠశాల ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా.. విద్యార్థుల భద్రతను గాలికి వదిలేశారు. పాఠశాల అధికారుల నిర్లక్ష్యం ఇద్దరు చిన్నారుల మృతికి కారణమైంది.

జస్టిస్ పికె మిశ్రాను సత్కరిస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సిఎం జగన్, హైకోర్టు సిజె శేషసాయి

జస్టిస్ మిశ్రాకు గౌరవ విందు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సుప్రీంకోర్టు న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా గౌరవార్థం రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, హైకోర్టు ప్రస్తుత సిజె ఆకుల వెంకట శేషసాయి, పలువురు న్యాయమూర్తులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్‌రెడ్డి, డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి, హాజరయ్యారు. విజయవాడ 'ఎ-కన్వెన్షన్'లో జరిగిన ఈ కార్యక్రమంలో జస్టిస్ పికె మిశ్రాను ముఖ్యమంత్రి శాలువాతో సత్కరించారు. అంతకుముందు ఆయన నివాసంలో న్యాయమూర్తిని సిఎం దంపతులు కలిశారు. ఎపి హైకోర్టు సిజెగా పనిచేసిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఇటీవల సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. ఆయన 1964 ఆగస్టు 29న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయగఢ్‌లో జన్మించారు. బిలాస్‌పూర్‌లోని గురు ఘాసిదాస్ యూనివర్సిటీ నుంచి బిఎస్‌సి, ఎల్‌ఎల్‌బి పట్టాలు పొందారు. 1987 సెప్టెంబరు 4న న్యాయవాదిగా పేరు నమోదు చేయించుకుని ఆయన సివిల్, క్రిమినల్ కేసుల్లో పేరుగాంచారు. ఛత్తీస్‌గఢ్ బార్ కౌన్సిల్‌కు ఛైర్మన్‌గా పనిచేశారు. 2004 జూన్ 26 నుంచి 2007 ఆగస్టు 31 వరకు ఆ రాష్ట్ర అదనపు అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. అనంతరం 2007 సెప్టెంబరు ఒకటి నుంచి న్యాయమూర్తి అయ్యే వరకూ అడ్వకేట్ జనరల్‌గా కొనసాగారు. 2009 డిసెంబరు 10న ఛత్తీస్‌గఢ్ న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 జూన్ ఒకటి నుంచి ఛత్తీస్‌గఢ్ హైకోర్టుకు తాత్కాలిక సిజెగా, తర్వాత ఎపి హైకోర్టు సిజెగా పనిచేసి ఇటీవల సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందిన సంగతి తెలిసిందే.

భవన నిర్మాణ కార్మికులకు కేరళ అండ

- రెట్టింపు ఖర్చు చేసిన 'సంక్షేమ' నిధులు
- ఉన్నవాటినే ఖర్చు చేయని ఇతర రాష్ట్రాలు

5

ఒపిఎస్ కోసం పోరాటం కొనసాగుతుంది

- ఎపి జెఎసి ఛైర్మన్ బండి శ్రీనివాసరావు
- ఫ్యాప్టో ఆందోళనలకు సంపూర్ణ మద్దతు

2

మహిళలపై హింసకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ప్రచార జాతా

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

క్విట్ ఇండియా డే సందర్భంగా ఆగస్టు 9న క్విట్ వయలెన్స్ పేరుతో మహిళలపై హింసకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార జాతా జరపనున్నట్లు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి తెలిపారు. జాతా ముగింపుగా విజయవాడలో భారీ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గురువారం విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఐద్వా నాయకులు శ్రీదేవి, శ్రీనివాసకుమారితో కలిసి ఆమె మాట్లాడారు. మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ దాడులపై నిపుణులతో కమిటీ వేసి చర్యలు తీసుకోవాలని కోరారు. బాపట్ల జిల్లాలో తన అక్కను వేధించొద్దన్నందుకు అమర్‌నాథ్ అనే బాలుడిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టి హత్య చేశారని, అత్యంత దారుణమైన ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే విశాఖపట్నంలో పరిపూర్ణానంద ఆశ్రమం ముసుగులో బాలికపై అత్యాచారానికి పాల్పడి క్రూరంగా హింసించారని, ప్రెగ్నెన్సీ తొలగించేందుకు అత్యంత దారుణంగా వ్యవహరించారని తెలిపారు. ఆ ఆశ్రమానికి గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రేమించలేదనే నెపంతో ఫ్రాన్సిక అనే యువతిపై యాసిడ్ దాడి చేశారని, మృత్యువుతో పోరాడి ఆమె చనిపోయిందని అన్నారు. దిశ యాప్ ద్వారా ఒక్క దాడిని కూడా ఆపలేకపోయారని తెలిపారు. విశాఖపట్నంలో వరలక్ష్మి అనే యువతిని వేధించడమే కాకుండా బెయిల్‌పై వచ్చి ఆమె తమ్ముడిని బెదిరిస్తున్నారని వివరించారు. విజయనగరంలో బాలికను కొట్టి వేధించి ప్రేమించాలని హింసించారని తెలిపారు. వార్డుల్లో మహిళా పోలీసుల ద్వారా యువతులను సంప్రదించి, వేధింపులు ఏమైనా ఉంటే వాటిని ప్రభుత్వం నిరోధించాలన్నారు. మద్యాన్ని నియంత్రిస్తామని చెప్పి అంతకంతకూ పెంచుకుపోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఒంటరి మహిళలకు రక్షణ చర్యలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనేకమంది బాధితులు ఎటువంటి పరిహారానికీ నోచడం లేదని, 2018 నుండి ఇప్పటికీ అనేక అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. దీంతో నిందితులు బాధితులపై ఒత్తిడి తెచ్చి రాజీ చేసుకునేందుకు బెదిరింపులకు దిగుతున్నారని తెలిపారు. బాపట్ల జిల్లాలో హత్యకు గురైన అమర్‌నాథ్ కుటుంబానికి భూమి ఇవ్వాలని, సోదరిని చదివించి ఉద్యోగం ఇవ్వాలని, దీనికి సంబంధించిన జిఒ విడుదల చేయాలని కోరారు.

నేడు ప్రతిపక్షాల భేటీ

- బిజెపి ఓటమే లక్ష్యం
- దాదాపు 20 పార్టీల సమావేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలోని ప్రజాకంటక మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ప్రతిపక్షాలు ఏకం అవుతున్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడిగా లేవనెత్తాల్సిన అంశాలపై చర్చించేందుకు శుక్రవారం పాట్నాలో 20 దాకా బిజెపి యేతర ప్రతిపక్ష పార్టీలకు చెందిన అతిరథ మహారథులంతా హాజరవుతున్నారు. ప్రతిపక్షాల ఎజెండాపై ఏకాభిప్రాయం సాధించడంపై ఈ సమావేశం ప్రధానంగా కేంద్రీకరించనుంది. సమావేశం తరువాత ప్రతిపక్ష పార్టీల లక్ష్యాలను వివరించే సంయుక్త పత్రికా ప్రకటన ఒకటి వెలువడే అవకాశముంది. అలాగే తదుపరి సమావేశ స్థలాన్ని, తేదీని శుక్రవారం నాటి సమావేశంలో ఖరారు చేయనున్నారు. కనీస ఉమ్మడి కార్యక్రమం ఈ సమావేశ ఎజెండాలో ఉండకపోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫెడరలిజంపై దాడులు, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, రాజ్యాంగ విలువలు, సూత్రాలను అవమానించడం, ఎన్నికైన ప్రభుత్వాల అధికారాలను కబళిస్తూ కేంద్రం ఆర్డినెన్సులు జారీ చేయడం వంటి మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను సమిష్టిగా తిప్పికొట్టేందుకు ప్రతిపక్షాల మధ్య స్థూలంగా ఒక అంగీకారం ఉంది. వీటిలోబాటు ధరల పెరుగుదల, నిరుద్యోగం, అతిథి కార్మికుల సంక్షేమం, తప్పుడు రైలు విధానం, పెరుగుతున్న మత ఉద్రిక్తతలు, అంతర్గత భద్రతలో తీవ్ర వైఫల్యం వంటి అంశాలను లేవనెత్తడం ద్వారా మోడీ ప్రభుత్వాన్ని ఎండగట్టాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. గరిష్ట లోక్‌సభ స్థానాల్లో బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఉమ్మడి అభ్యర్థిని నిలిపే ఆలోచన బలంగా ఉన్నప్పటికీ తొలి సమావేశంలో ఇది చర్చకు రాకపోవచ్చు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ చొరవతో ఏర్పాటైన ఈ సమావేశానికి .కాంగ్రెస్, డిఎంకె, జెడియు, ఆర్‌జెడి, సిపిఎం, సిపిఐ, ఎన్‌సిపి, టిఎంసి, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), జెఎంఎం, ఆప్, ఆర్‌ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్, సిపిఐ(ఎంఎల్), నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి, కేరళ కాంగ్రెస్, ఐయుఎంఎల్ తదితర పార్టీల నేతలు హాజరుకానున్నారు. సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, పిడిపి నాయకురాలు మెహబూబా ముఫ్తీ, మమతా బెనర్జీ వంటి నేతలు గురువారం సాయంత్రానికే ఇక్కడికి చేరుకున్నారు. ఆర్‌ఎల్‌డి అధినేత జయంత్ చౌదరి తాను విదేశీ పర్యటనలో ఉన్నందున సమావేశానికి రాలేకపోతున్నానని తెలిపారు. అయితే, ప్రతిపక్షాల ఐక్యతకు తమ మద్దతు ఉంటుందని బీహార్ సిఎం నితీష్ కుమార్‌కు రాసిన లేఖలో తెలిపారు. ఏపిలో అధికార, ప్రతిపక్ష పార్టీలైన వైసిపి, టిడిపి, తెలంగాణలోని అధికార పార్టీ బిఆర్‌ఎస్ ఈ సమావేశానికి

మిగతా 5లో

37 ఏళ్లుగా దక్కని ఉద్యోగాలు

- శ్రీశైలం నిర్వాసితులకు న్యాయం జరిగేనా?
- ఇప్పటి వరకూ 1460 అర్జీలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల మాదిరిగానే ఏళ్లు గడుస్తున్నా శ్రీశైలం నిర్వాసితులకు న్యాయం దక్కడం లేదు. సుమారు 66 గ్రామాల్లో దాదాపు లక్ష ఎకరాలు శ్రీశైలం ప్రాజెక్టు కింద మునిగిపోయాయి. సాగునీరు, విద్యుదుత్పత్తి ద్వారా రాష్ట్రానికి మేలు చేసిన ఈ జలాశయం వల్ల నిర్వాసితులైన వారికి ఇప్పటికీ న్యాయం జరగలేదు. శ్రీశైలం వద్ద కృష్ణా నదిపై 1963లో జలాశయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీని కింద సుమారు 66 గ్రామాల్లో లక్ష ఎకరాలు మునిగిపోయాయి. 1200 కుటుంబాలు భూములను కోల్పోయారు. 44 రెవెన్యూ గ్రామాలు, 22 మజరా గ్రామాల ప్రజలు నిర్వాసితులయ్యారు. ప్యాకేజీ కింద ఎకరాకు రూ. ఐదు లక్షల పరిహారం కాని లేదా ఇంటికో ఉద్యోగం ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. అయితే నిర్వాసితులు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల వైపు మొగ్గు చూపారు. హామీల అమలు కోసం 1982 నుంచి నిర్వాసితులు ఉద్యమాలు చేపట్టారు. ఈ మేరకు ప్రభుత్వం 1986లో జిఒ నంబరు 98ను జారీ చేసింది. 1200 మంది



మంత్రి అంబటి రాంబాబుకు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసిత నిరుద్యోగుల సంఘం నాయకులు (ఫైల్)

ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. మొదటి జాబితాలో 965 మంది అర్హులుగా ప్రకటించి.. 2012లో కేవలం 120 మందికి తాత్కాలిక పద్ధతిలో లస్కర్ ఉద్యోగాలు ఇచ్చారు. చంద్రబాబు పాలనలో రెండో జాబితాను తయారు చేయించారు. కానీ నేటికీ ఉద్యోగాలు ఇవ్వలేదు. 2019 సెప్టెంబరు 9 నుంచి 102 రోజులు నందికొట్కూరులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేశారు. దీక్ష చేపట్టిన 60వ రోజున అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ శ్రీశైలం నుంచి కర్నూలుకు వెళ్తుండగా కారును అడ్డుకున్నారు. నిర్వాసితులకు స్పష్టమైన హామీ ఇవ్వకుండా అనిల్ కుమార్ అక్కడి నుంచి జారుకున్నారు. దీక్ష కొనసాగితే సమస్య తీవ్రతరం అవుతుందని నంద్యాల ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ రంగంలోకి దిగారు. తప్పకుండా ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. నిర్వాసిత సంఘం నాయకులకు నిమ్మరసం ఇప్పించి దీక్షను విరమింపజేశారు. అయితే ఇప్పటికీ ఉద్యోగాలు ఇవ్వలేదు. ప్యాకేజీకి ఒప్పుకుంటే ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ఇస్తామని వైసిపి ప్రభుత్వం చెబుతోంది. కానీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగం అయితే నెలకు రూ.15 వేలు జీతం వస్తుంది. ఈ లెక్కన ప్రభుత్వం ఇచ్చే రూ. ఐదు లక్షల ప్యాకేజీ మూడు సంవత్సరాలకే వస్తాయి. తాజాగా 2022 డిసెంబర్‌లో మంత్రి అంబటి రాంబాబును కలిసి వినతిపత్రం కూడా అందజేశారు.

ఇన్ని అర్జీలు ఎవరూ ఇచ్చి ఉండరు

శ్రీశైలం నిర్వాసితులకు ఉద్యోగాలు ఇచ్చేలా 1986లో జిఒ 98ను ప్రభుత్వం ఇచ్చింది. న్యాయం చేయాలని ఇప్పటి వరకూ 1460 అర్జీలు వివిధ స్థాయి అధికారులకు ఇచ్చాం.అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిర్వాసితులకు న్యాయం చేయాలి.

- నారాయణ రెడ్డి, శ్రీశైలం నిర్వాసితుల నిరుద్యోగ సంఘం అధ్యక్షులు

తిరుమలలో చిన్నారిపై చిరుత దాడి

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల నడకమార్గం ఏడో మైలు వద్ద చిన్నారిపై చిరుత దాడి చేసింది. ఐదేళ్ల బాలుడిని నోట కరుచుకుని వెళ్లింది. అయితే భక్తులు, విధి నిర్వహణలో ఉన్న పోలీసులు కేకలు వేయడంతో సమీపంలోని అడవిలో చిన్నారిని వదిలేసింది. గాయాలపాలైన బాలుడిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి పరిశీలించారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన కౌశిక్‌గా బాలుడిని గుర్తించారు.

సిఎంను కలిసిన సమీర్ కొచ్చర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్కోచ్ గ్రూప్ ఛైర్మన్ సమీర్ కొచ్చర్ గురువారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన రాసిన ఇండియా 2047 హై ఇన్‌కమ్ విత్ ఈక్విటీ పుస్తకాన్ని సిఎంకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో స్కోచ్ గ్రూప్ వైస్ ఛైర్మన్ గురుశరణ్ ధంజల్ కూడా పాల్గొన్నారు.

ఎఐఎస్‌ల పనితీరుపై 15లోగా నివేదికలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అఖిల భారత సర్వీసు అధికారుల (ఎఐఎస్) పనితీరు నివేదికలు సమర్పించేందుకు ఉన్న గడువును తాజాగా పెంచుతూ కేంద్ర డిఒపిటి సర్క్యులర్ జారీ చేసింది. ఈ ఏడాది మే 31 నాటికే పర్సనల్ అప్రయిజల్ రిపోర్టును సమర్పించాలని నిర్దేశించినప్పటికీ అనేక మంది అధికారులు తమ నివేదికలను ఇంకా సమర్పించలేదు. దీంతో ఈ గడువును జూన్ 15 నాటికి పొడిగించినప్పటికీ ఫలితం లేకపోయింది. జులై 15 చివరి గడువు అని తాజాగా వెల్లడించింది. ఈలోగా స్వీయ నివేదికలు పంపించాలని, ఈ నివేదికలను సెప్టెంబరు 15 కల్లా ఆయా శాఖలు పరిశీలించాలని నిర్దేశించింది. అలాగే నవంబరు 15 నాటికి సమీక్షాధికారులు పరిశీలన పూర్తి చేసి, డిసెంబరు 15 నాటికి అనుమతి ఇవ్వాలన్నది తాజా నిర్దేశించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

ఖరీఫ్ వచ్చినా పరిహారమివ్వరా?

- రైతులను తక్షణమే ఆదుకోవాలి
- సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలి
- అన్నదాతల సమస్యలపై 30న మహా ధర్నా
- ఎపి రైతు సంఘం

పోస్టర్ ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గతేడాది ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఇప్పటికీ నష్ట పరిహారం చెల్లించకపోవడం దారుణమని ఎపి రైతు సంఘం నాయకులు తప్పుబట్టారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలైనందున తక్షణమే పంట నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల నిర్వాసితులకు భూసేకరణ చట్టం - 2013 ప్రకారం మార్కెట్ ధర చెల్లించాలని, పునరావసం, పరిహారాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే కౌలుదార్లకు గుర్తింపు కార్డులు, రైతు భరోసా ఇవ్వాలని, కనీస మద్దతు ధర స్వామినాథన్ కమిషన్ నిర్దేశించిన ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న విజయవాడలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వై కేశవరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పివి ఆంజనేయులు, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మహా ధర్నా పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె ప్రభాకర్‌రెడ్డి, వై కేశవరావు మాట్లాడుతూ.. గతేడాది ప్రకృతి వైపరీత్యాలతో లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నా..బాధిత రైతులను ప్రభుత్వం ఇప్పటికీ ఆదుకోలేదన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున తక్షణమే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా సొమ్ము అందజేసి ఆదుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లోని ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. నిర్వాసితుల పునరావాస సమస్యలను పరిష్కరించాలన్నారు.

రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న ఇతర అన్ని సమస్యలనూ పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 35 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వారికి ఎలాంటి రక్షణ లేని పరిస్థితి ఉందని, తక్షణం కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చి, రైతు భరోసా, పంటల బీమాను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఒపిఎస్ కోసం పోరాటం కొనసాగుతుంది

- ఎపి జెఎసి ఛైర్మన్ బండి శ్రీనివాసరావు
- ఫ్యాప్టో ఆందోళనలకు సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఒపిఎస్ కోసం పోరాటం చేయాల్సిందేనని ఎపి జెఎసి ఛైర్మన్ బండి శ్రీనివాసరావు తెలిపారు. ఒపిఎస్ అమలు కోసం రాష్ట్రంలో ఫ్యాప్టో చేపట్టిన ఆందోళనలకు తమ సంపూర్ణ మద్దతు వుంటుందన్నారు. విజయవాడలోని ఎన్‌జిఒ హోమ్‌లో ఎపిజెఎసి కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా బండి శ్రీనివాసరావు, జెఎసి సెక్రటరీ జనరల్ జి హృదయరాజుతో కలిసి మాట్లాడారు. జిపిఎస్‌కు తాము మద్దతు ఇవ్వలేదని అన్నారు. ఈ అంశంపై ఉద్యోగులు ఎలాంటి అపోహలకు అవకాశం ఇవ్వకుండా ఐక్యంగా పోరాటాలకు సమాయత్తం కావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచాలని కోరారు. పిఆర్‌సి, డిఎ బకాయిల చెల్లింపులను నాలుగేళ్లలో కాకుండా 2024 జనవరిలోపు చెల్లించాలన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను వేసిన వెంటనే ఐఆర్ గానీ ఫిట్‌మెంట్ గానీ ప్రకటించాలన్నారు. 2004 సెప్టెంబరు ఒకటి నాటికి రిక్రూట్ అయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులందరికీ ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరారు. కంటిజెంట్, పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్, డైలీ వేజెస్ ఉద్యోగులకు ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. ఉద్యోగులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి కమిషన్ ఆమోదించిన మహిళా శిశు సంక్షేమశాఖ ఉద్యోగుల అప్‌గ్రేడ్ చేయాలన్నారు. గ్రంథాలయ ఉద్యోగులు, కర్నూలు జోన్ పరిధిలోని ఐసిడిఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ జెఎసి సమావేశంలో నాయకులు కెవి శివారెడ్డి, హెచ్ తిమ్మన్న, కెఎస్ఎస్ ప్రసాద్, డి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వెంకటగిరిలో మాట్లాడుతున్న లోకేష్

చేనేత కార్మికులకు టిడ్కో ఇళ్లు

- 200 యూనిట్ల ఉచిత విద్యుత్ : లోకేష్

ప్రజాశక్తి-వెంకటగిరి (నెల్లూరు జిల్లా)

'చేనేత కార్మికుల కష్టాలు తెలుసుని పట్టు, కలర్, యార్న సబ్సిడీ తిరిగి అందజేస్తామని, సొంత మగ్గం ఉన్న వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తామని, చేనేత కార్మికులకు టిడ్కో ఇళ్ళు ఉచితంగా ఇస్తామని' టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వెంకటగిరి పట్టణంలో గురువారం సాగింది. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. మూడు వేల కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేసిన ఘనత తమ పార్టీకే దక్కిందన్నారు. గుడులు, బడులు కోసం వదిలిన స్థలాలను వైసిపి నాయకులు ప్లాట్లు వేసి అమ్మేశారని ఆరోపించారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కుడి భుజం ఎల్‌కెఆర్ పోలీసుస్టేషనులో పంచాయితీల నుండి ఎర్రచందనం, ఇసుక, గ్రావెల్ దందాలు నడుపుతున్నారని తెలిపారు. వెంకటగిరిలో రూ.పది కోట్లతో అక్రమంగా భవనం నిర్మించారని ఆరోపించారు. వెంకటగిరిలో ఇళ్ళు నిర్మించుకోవాలంటే వైసిపి నాయకులకు ముడుపులు ముట్ట చెప్పాల్సిందేనన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయమని అడిగినందుకు ఆనం రామనారాయణరెడ్డిని వేధించారని తెలిపారు. వెంకటగిరికి నిధులు ఇవ్వమని అడిగినందుకు నిందలు వేశారన్నారు. ఇప్పుడు ఏకంగా ఆనం కుటుంబాన్ని అవమానపరుస్తూ వైసిపి నాయకులు మాట్లాడుతున్నారని తెలిపారు. వైసిపి నేతలు పెన్నా నది నుండి ఇసుకను దోపిడీ చేస్తున్నారని తెలిపారు. వెంకటగిరి, రాపూరు, కలువాయి, డక్కిలి, బాలాయపల్లి, సైదాపురం మండలాల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని వైసిపి నేతలు భూకబ్జా చేశారని ఆరోపించారు. దళితుల భూములు కూడా వదలడం లేదని తెలిపారు. పాదయాత్రలో వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలేవీ?

- 4 నెలలుగా సర్క్యులర్లకే పరిమితం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కారుణ్య నియామకాలు చేపట్టడంలో ప్రభుత్వం సర్క్యులర్లకే పరిమితమైందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరోనా ప్రారంభమైన తర్వాత ఒక్క ఉద్యోగుల్లోనే 3,500 నుంచి 4 వేల మంది వరకు మరణించారని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. కేవలం కరోనాతో ఎంతమంది మరణించారన్న దానిపై స్పష్టమైన అంకెలు లేవని అప్పట్లోనే అధికారులు పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్న దాని మేరకు జిల్లాల్లో సుమారు రెండు వేల మంది మరణించగా, 700 మంది వరకు ఉపాధ్యాయులు, శాఖాధిపతుల కార్యాలయాల్లో 300 మంది వరకు, ఆర్‌టిసిలో మరో 770 మంది వరకు మరణించినట్లు సమాచారం. ఈ వివరాలను నిర్ధారణ చేసుకునేందుకే సాధారణ పరిపాలనశాఖ 2021లోనే ఒక ప్రొఫార్మాతో సర్క్యులర్ జారీ చేసింది. ఉద్యోగి పేరు, కేడర్‌తోపాటు, ఏ శాఖలో పనిచేస్తున్నారు, పుట్టిన తేదీ వివరాలు, సర్వీసులోకి వచ్చిన తేదీ, చనిపోయిన తేదీ, కారుణ్య నియామకాలు జరిగాయా? అన్న వివరాలను సేకరిస్తోంది. ఇప్పటివరకు శాఖాధిపతుల నుంచి సరైన సమాచారం సాధారణ పరిపాలన శాఖకు చేరుకోలేదు. ఈ నేపథ్యంలోనే తాజాగా మరోసారి అన్ని శాఖలకూ కారుణ్య నియామకాలకు సంబంధించి సర్క్యులర్ జారీ చేశారు. ఇందులో కూడా జత చేసిన ప్రొఫార్మాలో పాత వివరాలనే కోరడం గమనార్హం. ఈ వివరాలను గత నాలుగు నెలల్లో కోరడం ఇది మూడోసారి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కారుణ్య నియామకాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జాతీయ రహదారుల పనులు వేగవంతానికి చర్యలు : సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ, కొత్త రహదారుల నిర్మాణానికి సంబంధించిన పనులను వేగవంతంగా నిర్వహించాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. రహదారుల విస్తరణ, నిర్మాణాలకు చేపట్టాల్సిన భూసేకరణ, అటవీ, ఇంధనశాఖల నుంచి పొందాల్సిన అనుమతులు ఇతర అంశాలపై విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. పనులను నిర్దిష్ట గడువు ప్రకారం పూర్తిచేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న అటవీ, ఇంధన శాఖల అనుమతులు, భూసేకరణ సంబంధిత అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో పిసిసిఎఫ్ ఎకె ఝా, ఎన్‌హెచ్‌ఎఐ ఆర్‌ఒ ఆర్‌కె సింగ్, ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టరు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసే కుట్ర : మంత్రి గుడివాడ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోకి పెద్ద పరిశ్రమలు రాకూడదనే రాష్ట్రానికి వున్న బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కుట్రలు చేస్తున్నారని పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. మార్చిలో విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌తో రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్రానికి నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు రానున్నాయన్నారు. రాష్ట్ర పారిశ్రామిక అవసరాల కోసం మూడు ఇండస్ట్రియల్ కారిడార్‌లు, 50 వేల ఎకరాల భూమిని అందుబాటులో వుంచామని తెలిపారు.

హెల్త్ అలవెన్సులు చెల్లించాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్సు బకాయిలు చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. గురువారం మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ కమిషనరు పి కోటేశ్వరరావును ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె నాగభూషణం, కె ఉమామహేశ్వరరావు, నాయకులు ఎన్‌వి నాయుడు, కె పెంచలయ్య తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు ఐదు నెలలుగా హెల్త్ అలవెన్స్‌లు చెల్లించడం లేదని తెలిపారు. తక్షణం హెల్త్ అలవెన్స్‌ల చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే చాలా మున్సిపాలిటీలలో అవుట్‌సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. అందరినీ ఆప్కాస్‌లో చేర్చాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎపి విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం బాలకాశి డిమాండ్ చేశారు. విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలపై సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని బాలకాశీ హెచ్చరించారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి పవన్ కుమార్ మాట్లాడుతూ.. మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరిస్తామని, దళారీ వ్యవస్థను రద్దు చేస్తామని సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి అసెంబ్లీ సమావేశంలో చెప్పారని గుర్తుచేశారు. ఇప్పటివరకు సమస్యలను పట్టించుకోలేదని, పైగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లాలో ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డి ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం పీస్ రేట్లను కాంట్రాక్టర్లు సక్రమంగా చెల్లించడం లేదని కృష్ణా జిల్లా అధ్యక్షులు జి శివరామకృష్ణ తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి షేక్ హజరత్ వలి, అధ్యక్షులు రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల్లోంచి తొలగించడం అన్యాయం

- కర్నూలులో డిఇఒ కార్యాలయాన్ని ముట్టడించిన కెజిబివి గెస్ట్ ఫ్యాకల్టీ
- సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్ట్
- పలుచోట్ల కౌన్సిలింగ్ అడ్డగింత

కర్నూలులో డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కెజిబివి అతిథి అధ్యాపకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

మెరిట్ సాకుతో కొత్తవాళ్లను తీసుకుని తమను ఉద్యోగాల్లో నుంచి తీసివేయడం అన్యాయమని కెజిబివి అతిథి అధ్యాపకులు గురువారం ఆందోళనకు దిగారు. పలు జిల్లాల్లో డిఇఒ కార్యాలయాల్లో జరుగుతున్న కౌన్సిలింగ్‌ను అడ్డుకున్నారు. తమను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కర్నూలులో డిఇఒ కార్యాలయాన్ని కెజిబివి అతిథి అధ్యాపకులు ముట్టడించారు. వీరి ఆందోళనకు సిఐటియు, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. విద్యార్థి నాయకుల ఆందోళనతో దాదాపు మూడు గంటలకుపైగా సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు పోస్టుల కౌన్సిలింగ్ నిలిచిపోయింది. దీంతో విద్యార్థి నేతలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు హుస్సేన్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు అమర్ ఉన్నారు. అనంతరం వారిని విడుదల చేశారు. సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె వేణుగోపాల్‌తో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు, జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్ మాట్లాడారు. కెజిబివిలో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీనికి ఆయన స్పందిస్తూ కెజిబివి అతిథి అధ్యాపకుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతపురంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కాంట్రాక్ట్ పోస్టుల భర్తీ కోసం చేపడుతున్న కౌన్సిలింగ్ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అతిథి అధ్యాపకులు చేపట్టిన ఆందోళన రెండో రోజూ కొనసాగింది. అధికారులు కౌన్సిలింగ్ ఆపకుండా నిర్వహిస్తుండడంతో సిఐటియు నేతలు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు వారిని అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. శ్రీకాకుళంలోని సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయం వద్ద గెస్ట్ ఫ్యాకల్టీ నిర్వహించిన ధర్నాకు సిఐటియు నేతలు సంఘీభావం తెలిపారు. గెస్ట్ ఫ్యాకల్టీ చేపడుతున్న పోరాటానికి సిఐటియు మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. విజయనగరంలో ధర్నా చేశారు. పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. తమను విధుల నుండి తొలగించవద్దని కోరారు. ఒంగోలులోని సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయం ధర్నా చేసి, డిఇఒకి వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ నేతలు మద్దతు తెలిపారు.

ప్రజలకు అండగా ఉండే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమలాపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

రానున్న ఎన్నికల్లో ప్రజలకు అండగా ఉండే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో గురువారం నిర్వహించిన వారాహి యాత్రలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జనసేన అధికారంలోకొస్తే విద్య, వైద్యం సామాన్యుడికి అందుబాటులోకి తెస్తుందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక యువతకు ఇస్తానన్న 2.30 లక్షల ఉద్యోగాలు ఎవరికి ఇచ్చారో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. కోనసీమ ప్రాంతం అంటే కొబ్బరికి పెట్టింది పేరన్నారు. వైసిపి ప్రభుత్వంలో కొబ్బరి రైతులు దీనస్థితిలో ఉన్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే కొబ్బరి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సిపిఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని జగన్ తుంగలో తొక్కారన్నారు. ఇప్పుడు జిపిఎస్ అంటూ మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఆడపిల్లలకు రక్షణ కరువైందన్నారు. దళితులకు రాజ్యాంగపరంగా ఇచ్చిన పథకాలను తొలగించడం అన్యాయమన్నారు. అంబేద్కర్ పేరున ఉండే విదేశీ విద్య పథకానికి జగన్మోహన్‌రెడ్డి పేరు పెట్టడం సరికాదన్నారు. కోనసీమలో చమురు సంస్థలు, వేల కోట్ల రూపాయల విలువ చేసే పెట్రో ఉత్పత్తులను తరలించుకుపోతున్నాయన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించట్లేదని తెలిపారు. చమురు సంస్థల సిఎస్ఆర్ నిధులను నాయకులే మేసేస్తున్నారని విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి సంపూర్ణ మద్యపాన నిషేధమని చెప్పి నేడు వీధికో దుకాణం తెరిచారన్నారు. ప్రాణాలు పోయే నకిలీ మద్యాన్ని అమ్ముతూ ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారని తెలిపారు. ఇవన్నీ పోవాలంటే వైసిపికి చరమగీతం పాడాలన్నారు.

వార్డు సెక్రటరీల సస్పెన్షన్ ఎత్తేయాలి

- ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

విశాఖపట్నంలో అక్రమంగా పది మంది పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులపై విధించిన సస్పెన్షన్ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు సమాఖ్య గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులు కె అనూరాధ, ప్రధాన కార్యదర్శి ఎం గురుస్వామి రాష్ట్ర ప్రభుత్వ వార్డు. గ్రామ సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి గురువారం లేఖ రాశారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన 42 పుర, నగరపాలక సంస్థల్లో 2021 అక్టోబరు రెండోతేదీ నుండి చెత్తను సేకరణ ప్రక్రియ ప్రారంభించారు. దీనికి గాను ప్రజల నుండి రుసుము వసూలు చేసే బాధ్యతను కార్యదర్శులకు అప్పగించారు. లక్ష్యం ప్రతి నెలా 50 శాతం నుండి 60 శాతానికి చేరుకోని వారికి మెమోలు ఇస్తున్నారు. దీనిలో భాగంగా జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ పదిమంది కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేశారు. దీనిపై కార్యదర్శులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు కట్టకపోతే తమను బాధ్యులను చేయడం ఏమిటని బుధవారం జివిఎంసి కమిషనర్ కార్యాలయం ముందు బైఠాయించారు. సుమారు గంటన్నరపాటు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు చర్చలు జరపడానికి ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. వారి సస్పెన్షన్లు ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలో వివిధ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న వార్డు శానిటేషన్ కార్యదర్శులు ఎదుర్కొంటున్న పనిభారం, తీవ్ర మానసిక ఒత్తిడి వల్ల జరుగుతున్న మరణాలపై గతంలోనే లేఖ ద్వారా తెలిపామని పేర్కొన్నారు. వీటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరినట్లు నాయకులు తెలిపారు. ఇటువంటి చర్యలేమీ తీసుకోకపోగా చెత్తపన్ను వసూళ్లలో వెనుకంజలో ఉన్నారని పదిమంది వార్డు సెక్రటరీపై సస్పెన్షన్ విధించారని పేర్కొన్నారు. ఇది సరైంది కాదని, ప్రజలు ఇంటువంటి రుసుములు చెల్లించడానికి సిద్ధంగా లేరని అన్నారు. మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లకు ప్రత్యేక విభాగం ఉండాలని, ఆ విభాగం ద్వారా వసూళ్లు కాకుండా సచివాలయ కార్యదర్శులపై భారం మోపడం సరైంది కాదని తెలిపారు. దీనిపై వెంటనే జోక్యం చేసుకుని అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని కోరారు.

ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ లేదు

- డిజిపికి అచ్చెన్నాయుడు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. ఎన్‌టిఆర్ జిల్లా పెనమలూరులో ముప్పవరపు చౌదరి, లీలా రామకృష్ణప్రసాద్ ట్రస్టుకు చెందిన రూ.100 కోట్ల విలువైన ఆస్తులను కొట్టేసేందుకు వైసిపి నాయకులు కుట్ర పన్నారని డిజిపికి గురువారం రాసిన లేఖలో పేర్కొన్నారు. ట్రస్టు సభ్యులపై అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు అక్రమ కేసులు నమోదు చేశారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో వైసిపి నేతలు అడుగడుగునా భూఅక్రమాలకు పాల్పడుతున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాల్వ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ వేర్వేరుగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఆరోపణలు గుప్పించారు. ట్రస్టు భూములను దొంగపత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రయత్నిస్తున్న వైసిపి నేతల్ని వదిలేసి భూముల్ని కాపాడాలని ఫిర్యాదు చేసిన ఎన్‌ఆర్‌ఐలను బెదిరించి న్యాయవాదిని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు.

పూర్ణానందకు రిమాండ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

తల్లిదండ్రులను కోల్పోయి తన ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న వెంకోజీ పాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం నిర్వాహకులు పూర్ణానంద సరస్వతీ (పున్నయ్య)పై ఆరోపణలు నిర్ధారణ కావటంతో జూలై ఐదు వరకు కోర్టు రిమాండ్ విధించింది. ఈ కేసులో ఎంవిపి పోలీసుల ప్రాథమిక విచారణ చేపట్టారు. బాలికపై పూర్ణానంద లైంగిక వేధింపులకు పాల్పడినట్టు నిర్ధారించారు. అనంతరం ఆయనను విశాఖపట్నం ప్రధాన మెట్రో పాలిటన్ కోర్టులో హాజరుపరిచారు. పద్మావతి పూర్ణానంద సరస్వతీకి జూలై 5వ తేదీ వరకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు. దీంతో ఆయన్ని అడివివరం సమీపంలోని సెంట్రల్ జైలుకు తరలించారు.

ఆశ్రమ బహిష్కరణ చేయాలి : వెంకోజీపాలెం వాసుల డిమాండ్

బాలికపై లైంగిక దాడి కేసులో రిమాండ్‌కి వెళ్లిన పూర్ణానంద సరస్వతీని ఆశ్రమం నుంచి తక్షణమే బహిష్కరిస్తున్నట్టు జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ వెంటనే ఆదేశాలు జారీ చేయాలని కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. 2012లోనూ ఇలాంటి కేసులో ఆయన నిందితునిగా ఉన్నాడని గుర్తుచేశారు. గ్రామ సేవా సంఘం అధ్యక్షులు మద్దాల వీర వెంకట అప్పారావు, మాజీ అధ్యక్షులు కాళ్ల బాబూరావు పాల్గొన్నారు.

అరాచక పాలనకు వ్యతిరేకంగా ఐక్యఉద్యమాలు

సిపిఐ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అరాచకాలు పెరిగాయని వాటిని ఎదుర్కొవడానికి ఐక్య ఉద్యమాలకు ప్రతిఒక్కరూ సిద్ధం కావాలని సిపిఐ ఆధ్వర్యాన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయించింది. రాష్ట్రంలో దళితులు, మైనార్టీలు, మహిళలు, జర్నలిస్టులు, పిల్లలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, అరాచకాలు, హత్యలను నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో గురువారం విజయవాడ దాసరి భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ప్రతిపక్షాలు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, హైకోర్టు, డిజిపి ఎవరన్నా లెక్క లేకుండా పోయిందన్నారు. టిడిపి నాయకులు వర్ల రామయ్య మాట్లాడుతూ సిట్టింగ్ ఎంపి ఏమి చేస్తున్నాడో తెలియదు గాని ప్రతిపక్ష నాయకులు ఏమి చేస్తున్నారో మాత్రం తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ బాపట్ల ఘటనపై జాతీయ మీడియా స్పందించినా సిఎం జగన్ స్పందించలేదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ పెరిగిన క్రైం రేటును తగ్గించేందుకు పోలీసులు కొత్త విద్య నేర్చుకున్నారని చెప్పారు. దళితులు, పేద వర్గాలపై దాడులు చేసి డబ్బులిచ్చి మధ్యవర్తిత్వం చేస్తున్నారని ఆరోపించారు. మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, విసికె నాయకులు విద్యాసాగర్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఎం.రామకృష్ణ, ఎంసిపిఐ(యు) నాయకులు ఖాదర్‌బాషా, ఎంఆర్‌పిఎస్ నాయకులు వెంకటేశ్వరరావు, ఆర్‌పిఐ నాయకులు వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ ఎల్ నాయకులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడారు. జూన్ 27న కలెక్టర్లుకు వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు.

15లోపు వసతి గృహాల్లో ఖాళీల భర్తీ : మంత్రి మేరుగ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో ఉన్న అన్ని ఖాళీలనూ జులై 15 నాటికి భర్తీ చేయాలని అధికారులను ఆశాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆదేశించారు. హాస్టళ్ల నిర్వహణ, విద్యార్థుల అడ్మిషన్లు తదితర అంశాలపై గురువారం సమీక్ష నిర్వహించారు. విద్యార్థులందరికీ అన్ని సదుపాయాలూ కల్పించాలని, జగనన్న విద్యాకానుక కిట్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. 9, 10వ తరగతి విద్యార్థులకు ట్యూటర్లను నియమించి ఉత్తీర్ణత శాతం పెంచేలా ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. నూతన మెనూ అమలును పర్యవేక్షించాలన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో పదోతరగతి, ఇంటర్మీడియట్‌లలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించాలన్నారు. షెడ్యూల్ కాస్ట్ కాంపోనెంట్ పటిష్ట అమలుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షలో సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి జి జయలక్ష్మి, సంచాలకులు విజయకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు కాలరాస్తే ఊరుకోం

నిర్వాసితులకు అండగా ఉంటాం

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, కూనవరం, విఆర్.పురం

'పోలవరం ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు సహా సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితుల హక్కులను కాలరాస్తే ఊరుకోం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేయాలని చూస్తే ఆదివాసీలు మూడో కన్ను తెరవడం ఖాయం' అని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోలవరం పోరుకేక మహా పాదయాత్ర గురువారం కూనవరం మండలంలోని కొండ్రాజుపేట, ఆర్యూకరు, రేపాక సహా పలు గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా ఆర్యూకరు సచివాలయం, రేపాక సెంటర్లలో సమావేశాలు జరిగాయి. ఆర్యూకరులో నిర్వహించిన సమావేశంలో బి.వెంకట్ మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులు చేపట్టిన ఈ మహా పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. కూనవరం, విఆర్.పురం మండలాల్లో ప్రజలు ప్రలోభాలకు సైతం నెరవకుండా ఎర్రజెండా అభ్యర్థులను గెలిపించుకున్నారని అభినందించారు. మాజీ ఎమ్మెల్యేలు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య, మాజీ ఎంపిపి కారం శిరమయ్య అందించిన సేవలను గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రతిపాదించినప్పుడే పోలవరం నిర్వాసితుల పక్షాన నికరంగా నిలిచి పోరాడారని అన్నారు.

మునిగిపోయే గ్రామాల ప్రజలను ఆదుకుంటామని అసెంబ్లీ సాక్షిగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన హామీని ఆయన గుర్తు చేశారు. విభజన చట్టంలో పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపుతూ రాష్ట్రానికి ద్రోహం చేసిందని విమర్శించారు. ప్రజలను ఆదుకుంటామని 2019 ఎన్నికల ముందు ఈ ప్రాంతంలో పర్యటించిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించారన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు గత టిడిపి, ప్రస్తుత వైసిపి పోటీ పడ్డాయన్నారు. ఎకరా భూమికి కేవలం రూ.లక్షా 15 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అధికారంలోకి వస్తే రూ. ఐదు లక్షలు ఇస్తామంటూ ఇచ్చిన హామీని సిఎం జగన్ బుట్ట దాఖలు చేశారని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు అందజేసే పరిహారం, పునరావాసం భిక్షకాదని వారి హక్కని అన్నారు. ఈ సమావేశానికి విఆర్.పురం ఎంపిటిసి సభ్యులు పూణెం ప్రదీప్‌కుమార్ అధ్యక్షత వహించారు.

కాంటూరు లెక్కలు కాకి లెక్కలు : వి. శ్రీనివాసరావు

పరిహారం చెల్లింపునకు దశలవారీ పేరుతో మభ్యపెట్టారని, కాంటూరు లెక్కలు కాకి లెక్కలని గత ఏడాది వచ్చిన వరదలు తేల్చేశాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రేపాక సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పోలవరం నిర్వాసితులు చేపట్టిన ఈ మహా పాదయాత్ర జూలై 4 వరకూ కొనసాగుతుందని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే పాలకుల సంగతి తేల్చేందుకు నిర్వాసితులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. పునరావాసం, పరిహారం కల్పించాకే తమ ఊరిలోకి అడుగు పెట్టాలని హెచ్చరిస్తూ ప్రతి ఊరి ముందూ గ్రామ ప్రజలు బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. పెద్ద ఆర్యూకరు, రేపాకలలో అర్హులను సైతం జాబితాలో చేర్చలేదన్నారు. నిర్వాసితుల కోసం జరిగే ఈ పోరాటంలో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. దళితులు, ముస్లిములు, వెనుకబడిన తరగతులు, ఆదివాసీల హక్కులను కాలరాస్తోన్న బిజెపితో చెలిమి చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎవరిని ఉద్ధరిస్తారని ప్రశ్నించారు. పట్టిసీమలో ఎకరా భూమికి రూ.50 లక్షలు ఇచ్చారని, ఈ ప్రాంతంలోనూ అదే రీతిగా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు సైతం అదేవిధంగా పరిహారం చెల్లించాలన్నారు. గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులందరికీ కట్ ఆఫ్ డేట్ తొలగించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి కూనవరం వైస్ఎంపిపిసభ్యులు కొమరం పెంటయ్య అధ్యక్షత వహించారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు నాగమణి, అమ్మాజీ, జయసుధ, నాయకులు కుంజా రాధా, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, సిఐటియు నాయకులు మట్ల వాణిశ్రీ పాల్గొన్నారు.

సీతమ్మ స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న వి.శ్రీనివాసరావు తదితరులు

గామగ్రామానా 'పోలవరం పోరుకేక'

పోలవరం ముంపు ప్రాంతాల్లో మూడో రోజు కొనసాగిన పాదయాత్ర

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, కూనవరం, విఆర్.పురం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన పోలవరం పోరుకేక పాదయాత్ర మూడో రోజైన గురువారమూ ఉత్సాహంగా సాగింది. కొండ్రాజుపేట నుంచి ప్రారంభమైన ఈ యాత్ర పూసుగూడెం, ఆర్యూకరు, రేపాక, భగవాన్‌పురం, మూల్లూరు మీదుగా కూటూరు వరకూ సాగింది. యాత్ర అగ్రభాగాన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ తదితరులు ఉన్నారు. వందలాది మంది నిర్వాసితులు వారివెంట ఎర్రజెండాలు చేతబూని ముందుకు సాగారు. తమను మోసం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

కొండ్రాజుపేట వద్ద ప్రారంభమైన ఈ పాదయాత్రకు జనం హారతులు పట్టారు. ప్రతి ఇంటినీ పలకరిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఈ యాత్ర సాగింది. నిర్వాసితుల్లో చైతన్యం రేకెత్తించింది. ఆర్యూకర్ సచివాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో వి.శ్రీనివాసరావు, బి.వెంకట్ మాట్లాడారు. సిపిఎం ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన పోరాటాలను వివరించారు.

పాదయాత్రలో పాల్గొన్న వారితో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ఆకట్టుకున్న కళారూపాలు

యాత్ర పొడవునా ప్రజానాట్యమండలి కళాకారుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 'గోదారమ్మ నీటిముష్వలం, రేలా పాటల పూల కొమ్మలం, మమ్మల్ని ముంచక చూస్తే పదును ఈటెలం' అంటూ కళాకారులు, నిర్వాసితులు పాలక ప్రభుత్వాలను హెచ్చరిస్తూ గీతాలు ఆలపించారు. ఇవి జనంలో ఉత్తేజం రేకెత్తించాయి. పోరాటకాంక్షను రగిలించాయి.

విశేష మద్దతు

కొండ్రాజుపేటలో ప్రారంభమైన పాదయాత్రకు మాజీ ఎంపీ సోడి రామయ్య, మాజీ జెడ్‌పిటిసి కన్యక పరమేశ్వరి, మాజీ ఎంపిపి పోడియం అప్పారావు తదితరులు మద్దతు తెలిపారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలంటూ సాగుతున్న ఈ యాత్రలో పార్టీలకు అతీతంగా అందరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. మరికొద్ది దూరం వెళ్లేసరికి యాత్ర బృందానికి సిఐటియు కార్యకర్తలు, వ్యవసాయ కూలీలు ఎదురేగి స్వాగతం పలికారు. ఆదివాసీ యువత సంప్రదాయ విల్లంబులు ధరించి యాత్రలోనడిచారు. పాదయాత్ర రేపాక సెంటర్‌కు చేరుకోగానే ఆ గ్రామంలోని మహిళలు పూల మాలలతో స్వాగతం పలికారు. ఎండకు సైతం వెరవక తలపై నీళ్లబాటిళ్లతో కదులుతూ.. దాహార్తిని తీసుకుంటూ పోలవరం నిర్వాసితులు పాదయాత్ర చేస్తున్న తీరు వారి పట్టుదలకు దర్పణంగా నిలిచింది. యాత్రలో సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ప్రజాప్రతినిధులు ప్రదీప్ కుమార్, పులి సంతోష్ కుమార్, కొమరం పెంటయ్య, వెంకమ్మ, నాగమణి, అమ్మాజీ, కారం లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య సతీమణి సుక్కమ్మ, మాజీ ఎంపిపి సభ్యులు సున్నం నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రికవరీ ఆఫీసర్ వారి కార్యాలయం
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
భారత ప్రభుత్వము, ఆర్థిక మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (బ్యాంకింగ్ విభాగం)
31-31-21, గ్రౌండ్ & 1వ అంతస్తు, నారాయణ భవనం, సాయిబాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020, ఎ.పి.
ఫోన్: 0891-2957045, ఇ-మెయిల్: ro2.drtvpatnam@gmail.com

R.P. No.402 of 2019 in OA No. 473 of 2017
కెనరా బ్యాంక్, చంద్రమౌళి నగర్ బ్రాంచ్, గుంటూరు
వర్సెస్
M/s. శ్రీనివాస కాటన్ ట్రేడర్స్ & ఇతరులు

విషయం: ఇ-వేలం అమ్మకం వాయిదా ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా 12.04.2023 తేదీతో జారీచేసిన సేల్ ప్రొక్లమేషన్ / ఇ-వేలం అమ్మకపు నోటీసు ప్రకారం https://www.bankeauctions.com వెబ్‌సైట్‌లో 26.05.2023 వ తేదీన జరుపవలసిన షెడ్యూలు ఆస్తుల ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకం 31.05.2023 నాటి ఉత్తర్వులు మేరకు 23.06.2023 కు వాయిదావేయడమైనది. బిడ్లు రానందున, సిహెచ్ఆర్ బ్యాంక్ యొక్క అభ్యర్ధన మేరకు మరొకసారి **14-07-2023 నకు వాయిదా వేయడమైనది. ధరావత్తు మరియు బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది 12-07-2023 మరియు బిడ్స్ హార్డ్‌కాపీలను సమర్పించుటకు ఆఖరు తేది 13-07-2023.** తేది 12.04.2023 తో జారీచేసిన సేల్ ప్రొక్లమేషన్ / ఇ-వేలం అమ్మకపు నోటీసు ఇతర నియమనిబంధనలలో ఏ మార్పు లేదు.
(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద తేది. 21-06-2023 న జారీచేయడమైనది)
(బి.ఎన్.ఎస్.వి.ఎస్.కె. బంగార్రాజు), రికవరీ ఆఫీసర్

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)
E PROCUREMENT SHORT TENDER NOTICE
NIT No.30/MAU61-USI0TT(OTH)/9/2023-TT/4th Call, Dated: 21.06.2023
Name of Work: APCRDA - Providing Annual Maintenance Contract of Air conditioners installed in APCRDA Head office building, Vijayawada for the period **01.04.2023 to 31.03.2024-ECV: Rs.5,87,240/-.** The bid can be downloaded on AP e-procurement portal **from 23.06.2023 to 30.06.2023 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **30.06.2023 up to 15.00 Hrs,** Technical bid opening **30.06.2023 @ 16.00Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in** .
Sd/- Commissioner, APCRDA.

KAKINADA MUNICIPAL CORPORATION
'e' PROCUREMENT NOTIFICATION
Roc No. 19568/2023/E2, **Dated: 22-06-2023**
Tenders invited through ap e procurement platform for 33 works with an estimated contract value of **Rs. 4,69,55,686/-** from the eligible contractors in the following manner.

Thirteen Works for an amount of Rs. 74,29,496/-
Last date and time for downloading bid documents : 27-06-2023 upto 10-00 AM
Last date and time for submission of bids : 27-06-2023 upto 10-30 AM

Eighteen Works for an amount of Rs. 2,14,60,862/-
Last date and time for downloading bid documents : 04-07-2023 upto 10-00 AM
Last date and time for submission of bids : 04-07-2023 upto 10-30 AM

Two Works for an amount of Rs. 1,80,65,328/-
Last date and time for downloading bid documents : 07-07-2023 upto 10-00 AM
Last date and time for submission of bids : 07-07-2023 upto 10-30 AM

Tender Inviting Authority : **Commissioner, Municipal Corporation, Kakinada**
Mail: kkd_mplcorp@yahoo.com Call Centre Phone: 0884-2357722
Further details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in
Sd/- **Dr.R.MAHESH KUMAR,** *I.A.S.,*
Commissioner,
Municipal Corporation, Kakinada

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు
ఆర్.ఓ.సి.నెం.1354/2023/ఇ1 **ది. 20-06-2023**
నిట్ నెం.22/జే.టి.ఓ./2023-24

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ - సాధారణ నిధుల క్రింద మొత్తము 20 పనులకు ఈ దిగువ ఉదహరించిన తేదీల యందు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.
మొత్తము పనులు : 20 నెం.లు **అంచనా వ్యయము : రూ.188.25 లక్షలు**
పని నెం.: 01 నుండి 20 లకు :
1. టెండరు షెడ్యూల్ డౌన్ లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభతేది : ది.21-06-2023 ఉదయం గం.11.00 ని.ల నుండి
2. టెండరు షెడ్యూల్ డౌన్ లోడ్ కొరకు నిర్ణయించిన చివరితేది : ది.28-06-2023 ఉదయం గం.11.00 ని.ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరచు తేది : ది.28-06-2023 మధ్యాహ్నం గం.02.00 ని.లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ **http://www.apeprocurement.gov.in** చూడగలరు. మొబైల్ నెం. 9849907303

ఇట్లు
సం/- యు.శారదాదేవి, కమీషనర్,
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

సూర్యారావు ఆశయ సాధనకు కృషి

- **మాజీ ఎంపి మధు**

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి, పెద్దాపురం

యాసలపు సూర్యారావు ఆశయ సాధన కోసం చేసే కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఎంపి పి.మధు అన్నారు. సైకిల్ మెకానిక్‌గా జీవితాన్ని ప్రారంభించిన సూర్యారావు కమ్యూనిస్టుగా, కార్మిక నేతగా, పాత్రికేయునిగా, ప్రజాప్రతినిధిగా, కవిగా రాణించారన్నారు. యాసలపు సూర్యారావు 11 వర్ధంతి సందర్భంగా గురువారం కాకినాడ జిల్లా పెద్దాపురంలోని యాసలపు సూర్యారావు భవనంలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు అధ్యక్షతన 'తొమ్మిదేళ్ల బిజెపి పాలన - తీరు తెన్నులు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో మతోన్మాదం, కార్పొరేట్లకు ఊడిగం చేయటం తప్ప ఏమీ లేదన్నారు. ప్రభుత్వ రంగాన్ని ఒక్కొక్కటిగా కార్పొరేట్లకు దారాదత్తం చేస్తున్నారని తెలిపారు. రకరకాల పేర్లతో పన్నులు వేస్తూ ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. విభజన హామీలు ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. దేశ ప్రజల ఐక్యత మధ్య చిచ్చుపెట్టే బిజెపి పాలనకు రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడాలని ప్రజలను కోరారు. ఈ సదస్సులో సిపిఎం కాకినాడ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

సూర్యారావు వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న మధు

సుబ్బిరెడ్డి మరణం సెజ్ రైతులకు తీరని లోటు

పెనుమల్లు సుబ్బిరెడ్డి అకాల మరణం సెజ్ రైతులకు తీరని లోటు అని పి.మధు అన్నారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం రమణక్కపేటకు చెందిన సెజ్ పోరాట కమిటీ నాయకులు సుబ్బిరెడ్డి ఇటీవల అకాల మరణం పొందారు. ఆయన కుటుంబాన్ని పి.మధు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెజ్ రైతుల సమస్యలపై సుబ్బిరెడ్డి చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ఆ పోరాటం వల్లే సెజ్‌కు తీసుకున్న పదివేల ఎకరాల్లో రెండు వేల ఎకరాలను తిరిగి ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేశారు.

సంఘమిత్ర కు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లా చీరాల మండలం, ఈపురుపాలెం రైల్వేస్టేషన్ దగ్గరలో రైలు పట్టా విరిగిపోయింది. ఈ పట్టాల మీదుగా సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ వెళ్లాల్సి ఉంది. గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో ఈపురుపాలెం గ్రామ నివాసి గద్దె హేమ సుందర్‌బాబు రైల్ పట్టాల వైపు వెళ్లిన సమయంలో పట్టా విరిగినట్లు గమనించాడు. వెంటనే అప్రమత్తమై ఆ ట్రాక్‌పై విజయవాడ వైపు నుండి రైళ్లు వచ్చే అవకాశముందని భావించిన అతను సుమారు అర కిలోమీటర్ మేర పరిగెత్తుకుంటూ వెళ్లి విజయవాడ వైపు నుండి బెంగళూరుకు వెళుతున్న సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ లోకోపైలట్‌కు అర్థమయ్యే రీతిలో సైగలు చేస్తూ సమాచారం అందించారు. గమనించిన లోకో పైలట్లు వెంటనే ట్రైన్‌ను ఆపారు. .

బైజూస్‌కు గడ్డుకాలం

- **ఆర్థిక ఫలితాల వెల్లడిలో విఫలం**
- **వైదొలిగిన డెలాయిట్ ఆడిటర్లు**



న్యూఢిల్లీ : ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌కు గడ్డుకాలం మొదలయ్యింది. ఆ సంస్థకు ముగ్గురు డైరెక్టర్లు రాజీనామా చేశారు. అదే విధంగా ఆర్థిక ఫలితాలను వెల్లడించడంలో విఫలం కావడంతో ఆ సంస్థ చట్టబద్ధంగా నియమించుకున్న డెలాయిట్ హాస్కిన్స్ అండ్ సెల్స్ కూడా తప్పుకుంది. కంపెనీని నిర్వహించే విషయంలో బైజూస్ వ్యవస్థాపకుడు రవీంద్రన్‌తో ఏడాదిగా కొనసాగుతున్న విభేదాలే రాజీనామాకు కారణమని సమాచారం. కాగా.. బైజూస్ మాతృసంస్థ అయినా థింక్ అండ్ లెర్న్ ప్రయివేటు లిమిటెడ్ బోర్డు సభ్యులకు డెలాయిట్ ఓ లేఖ రాసిందని బిజినెస్ స్టాండర్డ్ ఓ కథనం ప్రచురించింది. "2022 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఆర్థిక నివేదికలు చాలా ఆలస్యం అయ్యాయి. దీని పరిష్కారానికి మాకు ఎలాంటి సమాచారం అందడం లేదు. ఆడిట్ నివేదిక సవరణలు, ఆర్థిక నివేదికల యొక్క ఆడిట్ సంసిద్ధత స్థితి, ప్రాథమిక పుస్తకాలు, రికార్డులు ఇవ్వకపోవడంతో మేము ఆడిట్‌ను ప్రారంభించలేకపోయాము." అని డెలాయిట్ తెలిపింది. ఆడిటింగ్ ప్రమాణాలకు అనుగుణంగా ఆడిట్‌ను ప్లాన్ చేయడం, డిజైన్ చేయడం, నిర్వహించడం, పూర్తి చేయడం వంటి వాటి సామర్థ్యంపై ఈ ఆలస్యం తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఆ సంస్థ లేఖలో పేర్కొంది. పై అంశాలను దృష్టిలో పెట్టుకుని మేము బైజూస్ యొక్క చట్టబద్ధమైన ఆడిటర్‌గా తాము తక్షణమే రాజీనామా చేస్తున్నామని వెల్లడించింది. 2020 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు డెలాయిట్ ఆడిటర్‌గా నియమించబడింది. కాగా మరోవైపు 2021-22 నుంచి వచ్చే ఐదేళ్ల వరకు తమ సంస్థ కొత్తగా బిడిఒ (ఎంఎస్‌కెఎ అండ్ అసోసియేట్స్) చట్టబద్ధ ఆడిటర్‌గా నియమించు కున్నట్లు బైజూస్ ప్రకటించడం విశేషం.

పరిమ్యాచ్ స్పోర్ట్స్ ప్రచారకర్తగా శివమ్ దూబే

హైదరాబాద్ : స్పోర్ట్స్‌వేర్ బ్రాండ్, పరిమ్యాచ్ స్పోర్ట్స్ తమ కంపెనీకి కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ క్రికెటర్ శివమ్ దూబేను నియమించుకున్నట్లు ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ ప్రతినిధులతో పాటు శివమ్ పాల్గొని మాట్లాడారు.

FORM NO.14
{See Regulation 33(2)}
OFFICE OF THE RECOVERY OFFICER I/II
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sri Narayana Bhawan,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020.

DEMAND NOTICE
(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961)
RC/381/2019 **05-04-2021**
CANARA BANK
Versus
M/s RAMA RAJI COTTON CORPORATION AND ANOTHERS
To
1. **M/s Rama Raji Cotton Corporation And Anothers,** D No 72 By 4 Care of Sri Lakshmi Cotton Traders, Datta Sai Estate, Etukuru Road, NH 5 Guntur Dist - **Also At:** D No 72 By 4 Care of Sri Lakshmi Cotton Traders, Datta Sai Estate Etukuru Road, NH 5, Guntur Dist.
2. **Sri P Shiva Kumar,** D No 72 By 4 Care of Sri Lakshmi Cotton Traders, Datta Sai Estate, Etukuru Road, NH 5 Guntur Dist.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, DEBTS RECOVERY TRIBUNAL VISHAKHAPATNAM in OA/628/2017 an amount of **Rs 2,06,50,491.00 (Rupees Two Crore Six Lakh Fifty Thousands Four Hundred Ninety One Only)** along with pendentellite and future interest @ 11.15% Compound Interest Monthly w.e.f. 04/07/2017 till realization and costs of **Rs 189000 (Rupees One Lakh Eighty Nine Thousands Only)** has become due against you (Jointly and severally).
2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.
3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.
4. You are hereby ordered to appear before the undersigned on 05/04/2021 at 10:30 a.m. for further proceedings.
5. In addition to the sum aforesaid you will be liable to pay,
(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;
(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount.
Given under my hand and the seal of the Tribunal, on this date: 05/04/2021
Recovery Officer
Debts Recovery Tribunal Vishakhapatnam

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్
మీ కుటుంబ బ్యాంక్, భారతదేశం అంతటా
Celebrating 100 Years of Trust

అసెట్ రికవరీ మేనేజ్‌మెంట్ బ్రాంచి, ఫస్ట్ ఫ్లోర్, ప్లాట్ నెం.50, శ్రీనగర్ కాలనీ, రోడ్డు నెం.3, బంజారాహిల్స్, హైదరాబాద్-500073.
ఫోన్ : 040-23755686/23745686
ఇ-మెయిల్ : hyd.arm@ktkbank.com
వెబ్‌సైట్ : www.karnatakabank.com
CIN : L85110KA1924PLC001128

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 3తో చదవబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని **కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్** వారి అధీకృత అధికారి తేది: **18.10.2022**న జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారం **రుణగ్రహీతలు/తనఖాదారు/ కో-ఆబ్లిగెంట్స్/హామీదారులైన: 1) మెస్సర్స్ శ్రీ సాయి ఫణీంద్ర వాణిజ్య** తరఫున యజమాని: **శ్రీ ఫణికుమార్ దివ్వెల,** చిరునామా: నెం. 68/5, ఏటుకూరు, బైపాస్ రోడ్డు, గుంటూరు-522003. **2) శ్రీ ఫణికుమార్ దివ్వెల, తండ్రి: శ్రీ కోటేశ్వరరావు దివ్వెల,** చిరునామా: నెం.68/5, ఏటుకూరు, బైపాస్ రోడ్డు, గుంటూరు-522003. **3) శ్రీ వెంకటేశ్వరరావు కుప్పం, తండ్రి: శ్రీ కుప్పం వీర్రాజు,** చిరునామా: ఫ్లాట్ నెం.201, హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్స్, మోతీనగర్, హైదరాబాద్. **4) శ్రీమతి మోహినిదేవి దివ్వెల, భర్త: శ్రీ కోటేశ్వరరావు దివ్వెల, 5) శ్రీ కోటేశ్వరరావు దివ్వెల, తండ్రి: శ్రీ డి.వెంకటేశ్వర్లు, వ.నెం.(4) & నెం. (5) చిరునామా:** చిరునామా: డి.నెం.19-15-59, IPD కాలనీ, 2వ లైను, సంగడిగుంట, గుంటూరు-522003. **6) శ్రీ వెంకట నాగ చందు దివ్వెల, తండ్రి: శ్రీ ఫణికుమార్ దివ్వెల,** చిరునామా: డి.నెం.19-15-59/ఎ, IPD కాలనీ, 2వ లేన్, సంగడిగుంట, గుంటూరు-522003. **7) శ్రీమతి కుప్పం ధాన్యవతి, భర్త: శ్రీ కె.వెంకటేశ్వరరావు,** చిరునామా: ఫ్లాట్ నెం.201, హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్స్, మోతీనగర్, హైదరాబాద్ వారిని నోటీసులో తెలిపిన రుణబకాయి మొత్తము కలుపుకొని **రూ.2,01,51,060.65 (అక్షరాల రెండు కోట్ల ఒక లక్ష యాభై ఒక్క వేల అరవై రూపాయలు మరియు అరవై ఐదు పైసలు మాత్రమే)** ఈ క్రింది విధముగా తెలుపబడిన వివరముల

ఖాతా నెం. & స్వభావం	చెల్లించవలసిన బకాయి	తేది నుండి వడ్డీ
PIOD AC NO. 2557000700086701	రూ.1,73,57,369/-	01.10.2022
PSTL AC NO. 2557001801151401	రూ.27,93,691.65	01.10.2022
మొత్తం	రూ.2,01,51,060.65	

కు సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది.

కాని రుణగ్రహీత, తనఖాదారులు మరియు కో-ఆబ్లిగెంట్స్/హామీదారులు రుణబకాయి తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్ యొక్క రూల్-8 & 9తో చదవబడే సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచు ఈ క్రింది సంతకందారు క్రింద తెలిపిన ఆస్తిని **21 జూన్, 2023**న స్వాధీనము చేసుకోవడమైనదని రుణగ్రహీతకు, తనఖాదారుకు, కో-ఆబ్లిగెంట్స్‌కు/హామీదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది.

కావున ప్రత్యేకించి రుణగ్రహీతను, తనఖాదారులను మరియు కో-ఆబ్లిగెంట్స్‌ను/హామీదారులను మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు జరుపరాదనియూ, ఒకవేళ జరిపినట్లయితే **కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్, గుంటూరు మెయిన్ బ్రాంచి** వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం ఈ క్రింది విధముగా

ఖాతా నెం. & స్వభావం	చెల్లించవలసిన బకాయి	తేది నుండి వడ్డీ
PIOD AC NO. 2557000700086701	రూ.93,14,440.00	01.06.2023
PSTL AC NO. 2557001801151401	రూ.30,03,918.65	01.06.2023
మొత్తం	రూ.1,23,18,358.65	

రూ.1,23,18,358.65 (అక్షరాల ఒక కోటి ఇరవైమూడు లక్షల పద్దెనిమిది వేల మూడు వందల యాభై ఎనిమిది రూపాయలు మరియు అరవై ఐదు పైసలు మాత్రమే) ప్లస్ వ్యయాలు బ్యాంకు యొక్క ఛార్జీకి లోబడి ఉండునని తెలియజేయడమైనది. (సదరు చట్టములోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) సదుపాయములను వినియోగించుకొనుచూ మీ సెక్యూర్డ్ ఆస్తిని విడిపించుకొనుటకు గల లభ్యతను పొందగలరని రుణగ్రహీతల అప్రమత్తతను ఆహ్వానిస్తున్నాము).

స్థిరాస్తుల వివరములు

ఐటమ్ నెం.1: గుంటూరు, సంగడిగుంట, 2వ లేన్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, డి.నెం.1151 నుండి 1153, డోర్ నెం.19-15-59 నందు **శ్రీమతి మోహినిదేవి దివ్వెలకు చెందిన** 88 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ప్లాట్ నెం.112 నకు సంబంధించిన యావత్తు. **దీనికి హద్దులు: తూర్పు:** దాన చెన్నకేశవరావుకు చెందిన ప్లాట్ నెం.113, 40'; **దక్షిణం:** ఆర్.శకుంతలకు చెందిన ప్లాట్ నెం.123, 20'; **పడమర:** యమ్.లలితకుమారికి చెందిన ప్లాట్ నెం.111, 40' మరియు **ఉత్తరం:** మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు 20'.

ఐటమ్ నెం.2: గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, శ్యామలానగర్ ఎక్స్‌టెన్షన్ దగ్గర, బ్లాక్ నెం.14, వార్డు నెం.14, నల్లపాడు డి.నెం.2-14-159, డి.నెం.264/ఎ నందు **1) శ్రీమతి కుప్పం ధాన్యవతి, 2) శ్రీమతి డి.వెంకట నాగచందుకు చెందిన** 288.88 చ॥గ॥ (192.54 చ॥గ॥ & 96.34 చ॥గ॥) విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఖాళీస్థలము ప్లాట్ నెం.36 నకు సంబంధించిన యావత్తు. **192.54 చ॥గ॥లకు హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.43, 26.8 అ॥; **దక్షిణం:** విప్పదపు నాగరాజు యొక్క ప్లాట్ నెం.37, 65 అ॥; **పడమర:** 30' వెడల్పుగల రోడ్డు-26.8 అ॥ మరియు **ఉత్తరం:** దివ్వెల వెంకటనాగచందు యొక్క స్థలము 65 అ॥. **96.34 చ॥గ॥లకు హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.43, 13.4 అ॥; **దక్షిణం:** కుప్పం ధాన్యవతి యొక్క స్థలము-65 అ॥; **పడమర:** 30' వెడల్పుగల రోడ్డు-13.4 అ॥ మరియు **ఉత్తరం:** ప్లాట్ నెం.35-65 అ॥.

ప్రదేశము : గుంటూరు
తేది : 21-06-2023
సం/- ఛీఫ్ మేనేజర్ / అధీకృత అధికారి
కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్

సంపాదకీయం

శాస్త్ర విజ్ఞానంపై కక్ష !

గత ఏడాది 300కి పైగా సైన్స్ అవార్డులను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో తొంభై రెండింటిని రద్దు చేయడం శాస్త్ర విజ్ఞానం పైన, శాస్త్రీయ దృక్పథంపట్ల కమలనాథుల కక్షకు తార్కాణం. సైన్స్, హెల్త్ రంగాల్లో అవార్డులను నిలిపేయాలని శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడెమీ ఈ అవార్డులను నిలిపేసినట్టు ప్రకటించింది. యువ శాస్త్రవేత్తలు, సైన్స్ టీచర్లు, అంతర్జాతీయ హోదా కలిగిన శాస్త్రవేత్తలు, మున్నగువారికి ఇవ్వడానికి ఉద్దేశించిన 72 అవార్డులను రద్దు చేసింది. నేషనల్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా కూడా 20కి పైగా అవార్డులను రద్దు చేసింది. శాస్త్రవేత్తల కోసం శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసిన అవార్డులను అర్ధంతరంగా హఠాత్తుగా రద్దు చేయడాన్ని బుద్ధిజీవులు విమర్శించడం సహజం. ఇది మన శాస్త్రీయ సంస్థల స్వయంప్రతిపత్తిని లాక్కునేందుకు చేపట్టిన ప్రక్రియని కొందరు ఆగ్రహిస్తున్నారు. ప్రభుత్వ నిధులు పొందుతున్న సంస్థ ఎవరికి ఎప్పుడు అవార్డులు ఇవ్వాలనేది ప్రభుత్వమే నిర్ణయించాలన్నది ఇందులోని ఆంతర్యమని ఓ శాస్త్రవేత్త వ్యాఖ్యానించారు. స్వయంప్రతిపత్తి సంస్థలుగా పేర్కొనబడే ఆయా సంస్థలను పూర్తిగా సర్కారు పెత్తనంలో నడపడానికేనని అంటున్నారు. యువ శాస్త్రవేత్తలకు, సైన్స్ టీచర్లకు అవార్డులు రద్దు చేయడాన్ని కేవలం వారి కెరీర్‌లోని అవకాశాలను గుంజుకోవడంగా కాకుండా వారిలో శాస్త్ర విజ్ఞానం పట్ల గల తృష్ణను చంపెయ్యాలన్న దుర్బుద్ధితో సర్కారు చేసిందని భావించాల్సి ఉంటుంది.

శాస్త్రీయ దృక్పథాన్ని (సైంటిఫిక్ టెంపర్) అభివృద్ధి చేయడం భారత పౌరుల ప్రాథమిక బాధ్యతగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఎ(హెచ్) పేర్కొంది. కనుక భారతీయ పౌరులందరూ శాస్త్రీయ దృక్పథాన్ని కలిగియుండాలి, అలా ఉండేలా ప్రోత్సహించాలి. కానీ సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వమే అందుకు విరుద్ధంగా వ్యవహరించడం దారుణం. రాజ్యాంగంలో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రాథమిక బాధ్యతగా పేర్కొన్నది యావత్ ప్రపంచంలో ఒక్క భారతదేశమే! జవహర్‌లాల్ నెహ్రూ తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించవలసిన ఆవశ్యకత గురించి వివరించారు. అది జాతీయోద్యమ భావన. స్వతంత్ర భారత ప్రభుత్వం ఏర్పడ్డాక శాస్త్ర విజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు, ప్రోత్సహించేందుకూ ఎన్నో ప్రతిష్టాత్మక సంస్థలను స్థాపించారు. సిఎస్ఐఆర్, ఎన్‌సిఎస్‌టిసి వంటివి ఎన్నో వచ్చాయి. సమకాలీన ప్రపంచంలో సైతం మన శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు, డాక్టర్లు అగ్ర భాగాన ఉన్నారంటే అటువంటి అవగాహనతో ఎంతో ముందు చూపుతో స్థాపించిన వివిధ ఐఐటిలు, ఐసిఎంఆర్, ఎయిమ్స్ వంటివీ కారణం.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం, హేతువాద దృష్టి, ప్రశ్నించే తత్వం పెరిగితే ఛాందస భావాలు, మూఢ విశ్వాసాలు వంటివాటికి ఎదురుదెబ్బ తగులుతుంది. మత ప్రాతిపదికన ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడమే లక్ష్యంగా గల సంఘపరివార్ శక్తులకు శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధత శత్రువుల వంటివే. అందుకే ప్రముఖ హేతువాదులైన ధబోల్కర్, గౌరీ లంకేష్, పన్సారే లాంటివారిని హత్య గావించారు. భౌతికంగా వారిని మట్టుబెట్టినా, అనేకమందిని బెదిరించినా హేతువు ను అడ్డుకోవడం సాధ్యం కావడంలేదు. అందుకే ఆ కుదురు నుండే వచ్చిన ప్రభుత్వ పెద్దలు ఈ వ్యవస్థలో భాగంగావున్న శాస్త్రీయ దృక్పథానికి తూట్లు పొడవాలని ఇటువంటి కుయత్నాలు చేస్తున్నారు. ఇటువంటి కుట్రలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలూ, ప్రగతి కాముకులు ఒక్కటై ఎదిరించాలి. భారత దేశ చరిత్ర, భారతీయ తాత్వశాస్త్రంలో చార్వాకులు, సాంఖ్యులు వంటివారి పాత్ర ఎంతో గొప్పది. వారి వారసత్వంగా సైన్సును, శాస్త్రీయ దృక్పథాన్ని నిలబెట్టడానికి, మరింతగా ప్రోత్సహించడానికీ భారతీయులందరమూ కృషి చేయాలి. ఛాందసత్వానికి, మౌఢ్యానికీ పెద్దపీట వేస్తున్న మోడీ సర్కారు విధానాల్ని తిప్పికొట్టాలి.

మహనీయుల మాట

రైతు పంటకు ఎరువు వేసి, నీరు పెట్టి ఊరుకోడు. ఎప్పటికప్పుడు కలుపు మొక్కలు తీసేస్తాడు. కలుపు తీయని ఎడల మంచి పంట రాదని అతనికి తెలుసు. అలాగే మానవ సమాజంలో మంచిని ప్రోత్సహించినంత మాత్రాన చాలదు. చెడుని నిరోధించాలి.

- గాంధీజీ

విశ్లేషణ

'పాట్నా' నుంచి దేశం ఏం ఆశిస్తోంది ?

ఎం.వి. గోవిందన్

జూన్ 23న బీహార్ రాజధాని పాట్నాలో విపక్షాల సమావేశం జరగనుంది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల నాటికి భిన్నంగా ఇప్పుడు విపక్షాలలో సామరస్యం, ఐక్యత కనిపిస్తోంది. మోడీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలన, దాని ప్రజా వ్యతిరేక విధానాలే ప్రతిపక్షాలలో ఇంతటి సామరస్యాన్ని సృష్టించాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రజల దైనందిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వకుండా, తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం మోడీ ప్రభుత్వం మతం పేరున ప్రజల మధ్య చిచ్చుపెట్టి వారిలో అభద్రతాభావం, గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్రలలో మతపరమైన అల్లర్లు పునరావృతం అవుతుండగా మణిపూర్‌లో రెండు నెలలగా కొనసాగుతున్న మతపరమైన హింస దీనినే రుజువు చేస్తున్నాయి.

జమ్మూకాశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన విధించి ఐదేళ్ల పూర్తయింది. జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని అరికట్టామని చెబుతున్నా అక్కడ ఎన్నికలు జరిగే సూచనలు కనిపించడం లేదు. బిజెపి పాలన ఇలాగే కొనసాగిన పక్షంలో దేశం ముక్కచెక్కలు అవుతుందన్న భయం బలంగా ఉంది. ఈ స్థితిలోనే ప్రతిపక్ష పార్టీల సమావేశం పాట్నాలో జరుగుతున్నది. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈ సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్నారు. సిపిఎం, సిపిఐ ప్రధాన కార్యదర్శులు, కాంగ్రెస్ అధ్యక్షుడు, నలుగురు ముఖ్యమంత్రులు, శరద్ పవార్ వంటి విపక్షాల సీనియర్ నేతలందరూ ఈ సమావేశానికి హాజరుకానున్నారు.

బిజెపి కి వ్యతిరేకంగా బలమైన లౌకిక ప్రజాస్వామ్య కూటమి ఉన్న రాష్ట్రం బీహార్. ఆర్‌జెడి నేతృత్వంలోని మహాకూటమి ఇక్కడ అధికారంలో ఉంది. లాలూ ప్రసాద్ ఆర్‌జెడి, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని జెడి(యు) చేతులు కలపడంతో రాష్ట్రంలో బిజెపి అధికారాన్ని కోల్పోయింది. ఈ కూటమితో సిపిఎం, సిపిఐ అవగాహన కుదుర్చుకున్నాయి. బీహార్‌పై ఎప్పుడూ సామ్యవాద, వామపక్ష రాజకీయాల ప్రభావం వుండనే వుంటుంది. 1990 అక్టోబర్‌లో అద్వానీ రథ యాత్రను బీహార్ లోని సమస్తిపూర్‌లో లాలూ ప్రసాద్ యాదవ్ అడ్డుకున్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జయప్రకాష్ నారాయణ్ చేపట్టిన ఉద్యమానికి బీహారే వేదికైంది. అందువల్ల మోడీ నేతృత్వంలోని హిందుత్వ శక్తులను ఎదుర్కొనేందుకుగాను ప్రతిపక్షాలు రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించడానికి పాట్నా సరైన వేదిక అనడంలో ఎలాంటి సందేహం లేదు.

భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్షాలు తమ రాజకీయ ఎత్తుగడలకు పాట్నాలో శ్రీకారం చుట్టనున్నాయి. విపక్షాల ఐక్యతకు సంబంధించి మూడు ప్రధాన అవగాహనలు ఉన్నాయి. అన్ని విపక్షాలను ఒకే వేదిక పైకి చేర్చి జాతీయ ప్రతిపక్ష కూటమిగా ఎదగవచ్చన్నది చాలా తేలికైన ఆలోచన. మరో ఆలోచన ఏదైనా ఒక రాజకీయ పార్టీ అధినేత నేతృత్వంలో ప్రతిపక్ష కూటమిని ఏర్పాటు చేయడం. మూడో ఆలోచన జాతీయమైనా, ప్రాంతీయమైనా ప్రతి రాష్ట్రంలో ప్రధానమైన బిజెపి వ్యతిరేక పార్టీ నాయకత్వంలో ఐక్యత.

ఇవన్నీ భారతీయ వాస్తవికతకు దూరంగా ఉన్న భావనలని చెప్పవచ్చు. విపక్షాలన్నింటినీ కలుపుకొని జాతీయ స్థాయిలో కూటమి లేదా ఫ్రంట్ ఏర్పాటు చేయడం కష్టం. అటువంటి కూటమి లేదా ఫ్రంట్ ఏర్పాటు ద్వారానే జాతీయ స్థాయిలో బిజెపిని ఓడించగలమన్న భావనకు భారత రాజకీయ వాస్తవికతకు లంకె కుదరదు. ఎన్నికల తర్వాత నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్, యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ ఏర్పడి ప్రధానమంత్రి అభ్యర్థిని ఎంపిక చేసుకున్నారు. కనీస ఉమ్మడి కార్యక్రమం కూడా ఎన్నికల తర్వాత రూపొందించబడుతుంది. కాబట్టి ఎన్నికలకు ముందే నాయకుడిని, ఫ్రంట్‌ను ఎంచుకోవాలనే వాదన భారత రాజకీయ వాస్తవికతకు సరిపోదు.

జాతీయ ప్రాముఖ్యత కలిగిన రాజకీయ అంశాలపై ప్రతిపక్షాల ఐక్యత ముఖ్యం. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ వ్యవస్థ, ఫెడరలిజంపై మోడీ ప్రభుత్వం, దానికి నాయకత్వం వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి దాడి చేస్తున్నాయి. ఇటువంటి కీలకమైన అంశాలపై ప్రతిపక్షం ఐక్యంగా నడుస్తుందా అన్నది ప్రశ్న. అదానీ వ్యవహారంపై జెపిసి విచారణ జరిపించాలని 18 రాజకీయ పార్టీలు రాసిన లేఖ అది సాధ్యమేనని రుజువు చేసింది. దీంతో పాటు ఇ.డి, సిబిఐ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుని ప్రతిపక్షాలను వేధించడానికి వ్యతిరేకంగా మెజారిటీ ప్రతిపక్షాలు ఏకమయ్యాయి. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేసినప్పుడూ ప్రతిపక్షాలు ఐక్యంగా నిరసన తెలిపాయి. ఆ తర్వాత తమిళనాడు మంత్రి వి.సెంథిల్ బాలాజీని ఇ.డి అరెస్టు చేసింది. ఢిల్లీ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులకు జైలుశిక్ష పడింది.

అయితే, మధ్యప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న భారీ రేషన్ కుంభకోణాలపై దర్యాప్తు చేయడానికి ఏ కేంద్ర ఏజెన్సీ కూడా సిద్ధంగా లేదు. అదానీ విషయంలోనూ అలాగే ఉంది. నియామకాలు, బదిలీల విషయంలో ఢిల్లీ లోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికే తుది అధికారం ఉంటుందన్న సుప్రీంకోర్టు తీర్పును అతిక్రమిస్తూ కేంద్రం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఢిల్లీ పోలీసులు చట్టపరమైన తమ విధులను విస్మరించి మహిళా రెజ్లర్లను వేధించిన బిజెపి ఎం.పి, భారత రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వత్తాసు పలుకుతున్నారు. సత్యపాల్ మాలిక్ వెల్లడించిన సంచలనాత్మక విషయాలపైగాని అదానీ కుంభకోణంపైగానీ మణిపూర్‌లో మత మారణహోమంపైగానీ ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఇటువంటి రాజకీయ సమస్యలకు ప్రత్యామ్నాయాన్ని చూపడంతో పాటు...ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్షాలు ముందుకు రావాలి. మరో మాటలో చెప్పాలంటే, ప్రజా సమస్యలపై ఉమ్మడి ప్రచారం, ఆందోళనలను ముమ్మరం చేయాలి.

కొన్ని రాష్ట్రాల్లో సంఘటిత ప్రచారానికి, పోరాటానికి అడ్డంకులు ఎదురుకావచ్చు. అలాంటిచోట సంబంధిత పార్టీలు ఈ ప్రచారాన్ని చేపట్టి తమదైన రీతిలో పోరాటం చేయడం మంచిది. అయితే కేంద్రంలో బిజెపి ని ఓడించడమే అంతిమ లక్ష్యంగా వుండాలి. అందుకు...రాష్ట్ర ప్రాతిపదికన వీలైనంత వరకు బిజెపి వ్యతిరేక ఓట్లను ఏకం చేయడంపై దృష్టి పెట్టాలి. బీహార్, తమిళనాడులో మాదిరిగా బిజెపి వ్యతిరేక ఓట్లను పోగు చేసేందుకు కృషి చేయాలి. క్లుప్తంగా చెప్పాలంటే, స్పష్టమైన ప్రత్యామ్నాయ విధానంతో జాతీయ సమస్యలపై ఏకాభిప్రాయాన్ని పెంపొందించుకుంటూ గరిష్టంగా బిజెపి వ్యతిరేక ఓట్లను సంపాదించడం, రాష్ట్రాలలో బిజెపికి వ్యతిరేకంగా సాధ్యమైనంత ఎక్కువ సంఘటిత ఆందోళన, పోరాటాన్ని నిర్మించడం ప్రతిపక్ష వ్యూహంగా వుండాలి. అందుకు తోడ్పడే చర్చలు, నిర్ణయాలు పాట్నా సమావేశం నుండి వస్తాయని ఆశించవచ్చు.

"కేంద్రంలో బిజెపి ని ఓడించడమే అంతిమ లక్ష్యంగా వుండాలి. అందుకు...రాష్ట్ర ప్రాతిపదికన వీలైనంత వరకు బిజెపి వ్యతిరేక ఓట్లను ఏకం చేయడంపై దృష్టి పెట్టాలి. బీహార్, తమిళనాడులో మాదిరిగా బిజెపి వ్యతిరేక ఓట్లను పోగు చేసేందుకు కృషి చేయాలి. క్లుప్తంగా చెప్పాలంటే, స్పష్టమైన ప్రత్యామ్నాయ విధానంతో జాతీయ సమస్యలపై ఏకాభిప్రాయాన్ని పెంపొందించుకుంటూ గరిష్టంగా బిజెపి వ్యతిరేక ఓట్లను సంపాదించడం, రాష్ట్రాలలో బిజెపికి వ్యతిరేకంగా సాధ్యమైనంత ఎక్కువ సంఘటిత ఆందోళన, పోరాటాన్ని నిర్మించడం ప్రతిపక్ష వ్యూహంగా వుండాలి. అందుకు తోడ్పడే చర్చలు, నిర్ణయాలు పాట్నా సమావేశం నుండి వస్తాయని ఆశించవచ్చు."

/వ్యాసకర్త సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు /

అభిప్రాయం

సామాజిక కార్యకర్తలుగా ఉపాధ్యాయులు



ఎన్. వెంకటేశ్వర్లు

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. కోటి ఆశలతో వచ్చిన విద్యార్థుల ఆకాంక్షలను తీర్చిదిద్దేలా పాఠశాల ఉండాలి. ఒత్తిడిని తగ్గించి మానసికోల్లాసాన్ని కల్పించేదిగా ఉండాలి. ఈ విద్యా సంవత్సరం విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడానికి, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి. విద్యార్థికి అక్షర జ్ఞానం అందించడం మాత్రమే కాదు...భావోద్వేగాల ఒత్తిడిని తగ్గించడం, భవిష్యత్ మీద ఆశ కల్పించడం, దానికి కావలసిన బాట ఏర్పరచడం వంటివి ముమ్మాటికి ఉపాధ్యాయులే చేయాలి.

వృత్తి కాదు బాధ్యత

మనల్ని చదివించడమే కాదు, మనకు ఉద్యోగాలు ఇచ్చి జీతభత్యాలు ఇస్తున్నది కూడా సమాజమే. వారి పిల్లల్ని మనం భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నాం. ఈ భావన మన గుండెల్లోకి ఎక్కితే, మనసు పొరల్లో హత్తుకుంటే ... నేను నా వృత్తిని బాధ్యతతో ప్రేమిస్తాను...నేనైతే ఈ లోకాన్ని ఇంకాస్త మెరుగుపరచాలనే ఆశతోనే ఉంటాను-అని చెప్పిన న్యూయార్క్ సిటీ ఉపాధ్యాయుని మాటలను ఆచరణలో పెడితే ఉపాధ్యాయ బాధ్యతకు అంతకంటే ఆనందం ఏముంటుంది. ఉపాధ్యాయులు పాఠశాల నుంచి బదిలీపై వెళ్తుంటే పిల్లలతోబాటు గ్రామ గ్రామం భోరున విలపించిన సందర్భాలు ఉన్నాయి. ఒక ఉపాధ్యాయుడు అడవిదారుల వెంట ప్రయాణం చేసి పాఠశాలకు వచ్చి చదువు చెబుతుంటే పేద తల్లిదండ్రులు డబ్బులు వేసుకుని గుర్రం కొనిచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఉపాధ్యాయ కుటుంబం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవటానికి సిద్ధపడితే ఆ కుటుంబాన్ని రక్షించి, ఆదరించి, తమలో ఒకరిగా ప్రేమించిన గ్రామాలున్నాయి. ఇలాంటి సందర్భాలు ఉపాధ్యాయులపై మరింత బాధ్యతను పెంచుతున్నాయి.

బడి బతకాలంటే..

ప్రాథమిక పాఠశాలల విలీనం, ఉపాధ్యాయ పోస్టుల రేషనలైజేషన్, గిరిజన, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు, ఎయిడెడ్ విద్యా సంస్థల విలీనం, బోధన కంటే బోధనేతర పనుల కోసమే ఎక్కువ సమయాన్ని కేటాయించాల్సి రావటం, పాఠశాల సమయంలోనే యూ-ట్యూబ్ శిక్షణా తరగతులు... విద్యార్థికి-ఉపాధ్యాయుడుకి మధ్య సంబంధాన్ని మసకబారుస్తున్నాయి. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై నిరంతర ప్రాతినిధ్యం, అవసరమైన సందర్భంలో పోరాటం చేయాల్సి వస్తే తగ్గాల్సిన పనే లేదు, రాజీ పడేదే లేదు. ఉపాధ్యాయుడు విద్యార్థికి బోధించాల్సిన సమయాన్ని ఎవరు హరించినా అంగీకరించం-అని ఎలుగెత్తి చాటాలి. అదే సందర్భంలో ఒక్కొక్క విద్యార్థి ప్రభుత్వ బడిని వదిలేస్తుంటే మనసు విలవిలాడిపోతుంది. ప్రభుత్వ బడిని రక్షించుకోవడం కోసం తల్లిదండ్రులతో, సమాజంతో కలసి పోరాటం చేయాలి. బడి బతకాలంటే ఉపాధ్యాయులే చుట్టూ ఉన్న సమాజాన్ని సమీకరించాలి.

వాస్తవాలు చెప్పాలి

రాజ్యాంగం ఆర్టికల్ 51ఏ (హెచ్)లో ఈ దేశ ప్రజలందరికీ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి అనే మాట రాసుకున్నాము. శాస్త్రీయ దృక్పథాన్ని అందించటం అంటే నిరూపితమైన అంశాలు, పురావస్తు శాఖ ద్వారా తెలిసిన వాస్తవాలను విద్యార్థులకు అందించాలి.

అయితే 10,11,12 తరగతిలో డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని, 12వ తరగతి 9వ అధ్యాయంలో 'కింగ్ ఆఫ్ హిస్టరీ మొఘల్ దర్బార్' పాఠంలో 28 పేజీల చరిత్రని, 6వ అధ్యాయంలో భక్తి, సూఫీ సాంప్రదాయాలను, మతోన్మాదుల పట్ల గాంధీజీకి ఉన్న అయిష్టతను, నాథూరామ్ గాడ్సేకు సంబంధించిన వ్యాఖ్యలను, 11వ తరగతి సోషియాలజీ పుస్తకం నుండి 2002 గుజరాత్ అల్లర్లకు సంబంధించిన అంశాలను, 9,10 తరగతులలో ఉన్న ఆవర్తన పట్టికలను పాఠ్యాంశాల నుంచి తొలగించారు.

2020-22 మధ్యకాలంలో కరోనా వల్ల పిల్లలకి బోధన చేయటం సాధ్యం కాలేదు కనుక, కరోనా అనంతరం పుస్తకాల బరువు తగ్గించడానికి పాఠ్యాంశాలను కుదించాం తప్ప మరింకే కారణం లేదని ప్రభుత్వం చెబుతున్నది. ఇది వాస్తవమా? పాఠాలను తొలగించడం ద్వారా వాస్తవ చరిత్రలను తెలియకుండా చేయడం ద్వారా, నాణ్యమైన విద్యార్థి తయారు కావడం సాధ్యం కాదు. ఏది తప్పో...ఏది ఒప్పో నిర్ణయించుకోవలసింది చదువుకునే విద్యార్థులు. కాని, రెండు కోణాలను చెప్పకుండా ఒకే కోణాన్ని విద్యార్థుల ముందుంచి ఇదే వాస్తమని చెప్పటం సరికాదు. వాస్తవ చరిత్రను రక్షించుకోవడం ఉపాధ్యాయుల బాధ్యత. రాజ్యాంగంలో నిర్దేశించిన శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థుల్లో పెంపొందించటం ఉపాధ్యాయుల కర్తవ్యంగా భావించాలి. ప్రతి సంఘటన వెనుక ఉన్న కారణాలను విశ్లేషించుకునే శక్తిని విద్యార్థికి ఇవ్వాలి.

ఉపాధ్యాయులు జీవ నది లాంటివారు

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ప్రతి అంశాన్ని ఉపాధ్యాయులు అధ్యయనం చేయాలి. ఆ పరిణామం వెనుక ఎవరి ప్రయోజనం ఉందో స్పష్టంగా అర్థం చేసుకోవాలి. సంపద సృష్టించే వారు, ఆ సంపదను అనుభవించే వారిలో ఎవరి పక్కన ఎవరి ప్రయోజనం కోసం నిలబడాలో స్పష్టత ఉండాలి. ఆఫ్గన్ పరిణామాలను లోతుగా విశ్లేషించాలి. మతోన్మాదం పెరిగితే ప్రజలకు ఎలాంటి కష్టాలు వస్తాయో అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని, పర్యావరణాన్ని, మానవ హక్కులను ఖూనీ చేస్తూ ఇతర దేశాల్లో ప్రజాస్వామ్యం లేదని గగ్గోలు పెడుతున్న సామ్రాజ్యవాదుల నిజస్వరూపాన్ని అర్థం చేసుకోవాలి. సరిహద్దు దేశాల్లో ఏ దేశంతో ప్రమాదమో, ఏ దేశంతో సఖ్యతను ఏర్పరచుకోవాలో విశ్లేషించుకోవాలి. సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులు, వాటి నిజ స్వరూపాలను అవగతం చేసుకోవాలి. ఆర్థిక సంక్షోభం, ఉక్రెయిన్, రష్యా యుద్ధం సందర్భంలో నాటో పాత్రను లోతుగా పరిశీలించాలి. మొత్తంగా ఉపాధ్యాయులు అన్ని అంశాల పట్ల ఒక స్పష్టమైన, సమగ్ర అవగాహన కలిగిన జీవనది లాగా సమాజానికి ఆదర్శంగా ఉండాలి.

/వ్యాసకర్త యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు /

సమస్య

ఆ హామీలు నీటిపై రాతలేనా?



ఎ.వి. నాగేశ్వరరావు

రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా, మానిఫెస్టోలో, ప్రజా సంకల్ప యాత్రలో హామీలిచ్చింది. కాని ఈ హామీలను నేటికీ అమలు చెయ్యలేదు.

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, విద్యుత్, ఆర్‌టిసి, టూరిజం, హౌసింగ్ వంటి 26 ప్రభుత్వరంగ సంస్థలు, మున్సిపల్, పంచాయితీ వంటి స్థానిక సంస్థలు, ప్రభుత్వ సొసైటీలు, సమగ్రశిక్ష, నేషనల్ హెల్త్ మిషన్, ఉపాధి హామీ, వెలుగు తదితర ప్రభుత్వ పథకాలు, యూనివర్శిటీలు, టిటిడి వంటి ధార్మిక సంస్థలలో మూడు లక్షలకు పైగా ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నారు. వీరే కాక పై శాఖలు, సంస్థలలో 3 దశాబ్దాల నుండి ఎన్ఎంఆర్, డైలీ వేజ్, కంటింజెంట్, టైమ్ స్కేల్ ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరంతా ఏ నాటికైనా తాము రెగ్యులర్ అవుతామన్న ఆశతో అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అందరినీ రెగ్యులరైజ్ చేస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న తరుణంలో 2014 జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తయిన 10,177 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ వాస్తవంగా క్యాబినెట్ నిర్ణయం ప్రకారం రెగ్యులర్ కావడానికి అవకాశమున్న ఉద్యోగులు 6,665 మంది మాత్రమే. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఇంత మందిని మాత్రమే రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి చెప్పలేదు. అందరినీ రెగ్యులరైజ్ చేస్తామన్నారు. కానీ దీనికి భిన్నంగా ప్రభుత్వం ప్రకటన చేయడం 3 లక్షల మంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగు ఉద్యోగులను మోసగించడమే. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు, అసంతృప్తికి గురిచేస్తున్నది. ఇచ్చిన హామీల ప్రకారం అందర్నీ రెగ్యులరైజ్ చేయాలి. 'మాట తప్పను - మడమ తిప్పను' అనే మాటలను అందర్నీ రెగ్యులరైజ్ చేయడం ద్వారానే సి.ఎం జగన్‌మోహన్ రెడ్డి రుజువు చేసుకోవాలి.

సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో తక్కువ వేతనాలతో జీవో 5, 7 లను విడుదల చేసింది. గత పిఆర్‌సి లోని కనీస వేతనం రూ.20 వేలు కాగా కేవలం రూ.15 వేలతో జీవో 7 విడుదల చేసింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను దగా చేసింది. నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, ఉపాధి హామీ, వెలుగు, 102, 104, 108, ఏపి సాక్స్, ఎన్‌టిఇపి, మెప్మా, ఐసిడిఎస్ వంటి ప్రభుత్వ పథకాలలో పని చేస్తున్న వేలాది మంది కాంట్రాక్టు ఉద్యోగులకు అమలు చేయాల్సిన మినిమమ్ టైమ్ స్కేలు నేటికీ అమలు చెయ్యలేదు.

ప్రభుత్వ విధానాల వల్ల పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, కరెంటు చార్జీలు, రవాణా చార్జీలతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థితి ఉన్నది. వీటి పరిష్కారానికై అందరూ కలిసి ప్రభుత్వంపై ఐక్యంగా ఒత్తిడి తేవాలి.

అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఎన్.యం.ఆర్ డైలీ వేజ్, కంటింజెంట్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులనే పేరిట రాష్ట్ర ప్రభుత్వ పథకాలేవీ వర్తింపచేయడం లేదు. వీరికి ప్రభుత్వ పథకాలను అమలు చేయడం కష్ట సాధ్యమేనంటూ ముఖ్యమంత్రి సెలవివ్వడం అన్యాయం.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కొత్తగా వచ్చారని, ఏడాదే అయ్యిందని మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు సరైనవి కావు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉమ్మడి రాష్ట్రం నాటి నుండి విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలకు సేవలందిస్తున్నారన్న వాస్తవాన్ని మంత్రియ్యులు తెలుసుకోవడం మంచిది. తెలంగాణలో ఎవ్వరూ రెగ్యులర్ కాలేదంటున్న మంత్రి వ్యాఖ్యలు వాస్తవం కాదు. తెలంగాణలో 2014 జూన్ 2 నాటికి పనిచేస్తున్న వారిని (5,544 మందిని) రెగ్యులర్ చేశారు. వీరితో పాటు విద్యుత్ రంగంలో పనిచేస్తున్న వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులందరినీ ఆర్టిజన్స్‌గా రెగ్యులర్ చేశారు. ఈ విధంగా మంత్రివర్యులే మాట్లాడటం ఆయన స్థాయికి తగినది కాదు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపకుండా రాష్ట్ర ప్రభుత్వం వారి వాస్తవ సమస్యలను అర్థం చేసుకోలేదు. ఇప్పటికైనా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సమస్యలపై వారి జెఎసి నాయకత్వంతోనే చర్చలు జరిపే పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం అవలంబించాలి. సమస్యల పరిష్కారానికై ఇప్పటికే వారి జెఎసి పోరుబాట పట్టింది. ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కింది సమస్యలు పరిష్కరించాలి.

1. డిసెంబర్ 31, 2022 నాటికి పని చేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి. 2. ఉద్యోగికి 3-5 సంవత్సరాల సర్వీస్ పూర్తయిన వెంటనే రెగ్యులర్ చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలి. 3. టైమ్ స్కేల్, డైలీ వేజ్, కంటింజెంట్ తదితర క్యాడర్ల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. 4. పార్ట్ టైమ్, గెస్ట్ వ్యవస్థను ఫుల్ టైమ్‌గా మార్చాలి. 5. అందరికీ సమాన పనికి సమాన వేతనం, సౌకర్యాలు అమలు చేయాలి. ఒకే క్యాడర్-ఒకే వేతనాన్ని అమలు చెయ్యాలి. 6. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి. 7. పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. 8. రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలి. 9. సాధారణ సెలవులు, అనారోగ్య సెలవులు, మెడికల్ లీవ్‌లు ఇవ్వాలి. 10. ఇపిఎఫ్, ఇఎస్ఐ లను కాంట్రాక్ట్, గెస్ట్, పార్ట్ టైమ్, వివిధ స్కీమ్‌లలో అమలు చెయ్యాలి.

ఈ సమస్యల పరిష్కారానికై పెద్ద ఎత్తున కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైమ్, గెస్ట్ తదితర క్యాటగిరి ఉద్యోగులు ఐక్య ఆందోళనలు నిర్వహించాలని జెఎసి నిర్ణయించింది.

ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అందరినీ రెగ్యులరైజ్ చేస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న తరుణంలో 2014 జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తయిన 10,177 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కానీ వాస్తవంగా క్యాబినెట్ నిర్ణయం ప్రకారం రెగ్యులర్ కావడానికి అవకాశమున్న ఉద్యోగులు 6,665 మంది మాత్రమే. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఇంత మందిని మాత్రమే రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి చెప్పలేదు. అందరినీ రెగ్యులరైజ్ చేస్తామన్నారు. కానీ దీనికి భిన్నంగా ప్రభుత్వం ప్రకటన చేయడం 3 లక్షల మంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగు ఉద్యోగులను మోసగించడమే.

/వ్యాసకర్త ఎ.పి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్, వర్కర్స్ జెఎసి ఛైర్మన్ /

భవన నిర్మాణ కార్మికులకు కేరళ అండ

- రెట్టింపు ఖర్చు చేసిన 'సంక్షేమ' నిధులు
- ఉన్నవాటినే ఖర్చు చేయని ఇతర రాష్ట్రాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్మికులను ఆదుకోవడంలో సిపిఎం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఆదర్శంగా నిలిచింది. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఉన్న నిధుల కంటే రెట్టింపు స్థాయిలో అదనపు నిధులను ఖర్చు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పన్ను చట్టం ప్రకారం ఆయా రాష్ట్రాల్లో రోడ్లు, భవనాల నిర్మాణదారులు, కంపెనీల నుంచి ఒక శాతం పన్ను వసూలు చేయాలి. వీటిని భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుల ద్వారా ఆయా రాష్ట్రాల కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు ఖర్చు చేయాలి. కేరళ రాష్ట్రంలో 20,45,538 మంది కార్మికులు ఆ రాష్ట్ర భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉన్నారు. కేరళ సంక్షేమ బోర్డుకు పన్నుల రూపంలో రూ.2,740.95 కోట్ల నిధులు వచ్చాయి. ఈ నిధులతోపాటు కేరళ ప్రభుత్వం అదనంగా రూ.1,648.83 కోట్లు కలిపి మొత్తం రూ.4,399.78 కోట్లను కార్మికుల కోసం ఖర్చు చేసింది. కార్మికుల సంక్షేమం కోసం ఉన్న నిధులతోపాటు అదనంగా ఖర్చు చేసిన కేరళ ప్రభుత్వం ఒక్కటేనని పార్లమెంటులో జరిగిన పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనశాఖ మంత్రి రామేశ్వర్ తెలి వెల్లడించారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పన్ను చట్టం ప్రకారం పన్ను ద్వారా వచ్చిన నిధులను బోర్డులో సభ్యులుగా నమోదైన కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలి. కార్మికుడు ప్రమాదవశాత్తు మరణించినా, అంగవైకల్యం కలిగినా రూ.5 లక్షల వరకు బీమా కల్పించాలి. కార్మికుల ఆరోగ్యానికి, కార్మికుల ఆడపిల్లల పెళ్లి ఖర్చులు, మెటర్నటీ, పిల్లల చదువుల కోసం బోర్డు నుంచి ఆర్థికసాయం అందించాలి. కార్మికుల ఇంటి నిర్మాణం కోసం రుణాలు అందించాలి. 60 ఏళ్ల దాటిన కార్మికులకు పెన్షన్ సౌకర్యం కూడా చట్ట ప్రకారం కల్పించాలి. దేశవ్యాప్తంగా 5.06 కోట్ల భవన నిర్మాణ కార్మికులు ఆయా రాష్ట్రాల వారీ భవన నిర్మాణ సంక్షేమ బోర్డుల్లో సభ్యులుగా ఉన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల బోర్డుల్లో మొత్తం రూ.87,478 కోట్ల నిధులు ఉన్నాయి. అయితే ఇందులో రూ.49,269 కోట్లు మాత్రమే రాష్ట్రాలు కార్మికుల కోసం ఖర్చు చేశాయని మంత్రి చెప్పారు. భవనాలు, రోడ్లు ఇతర నిర్మాణదారులు, కంపెనీల నుంచి పన్ను వసూలు చేసి కార్మికుల సంక్షేమం కోసం బోర్డులు ఖర్చు చేయడం నిరంతర ప్రక్రియ. కేరళలో తప్ప మిగతా ఏ రాష్ట్రంలోనూ కార్మికుల కోసం ఈ నిధులను వినియోగించిన దాఖలాలు లేవు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా కార్మికుల సంక్షేమానికి వెచ్చించిన పాపాన పోలేదు. బిజెపి అధికారంలో ఉన్న గోవా, ఉత్తరప్రదేశ్, త్రిపురలోనూ ఇదే పరిస్థితి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయి.

నిధుల ఖర్చుల వివరాలు

రాష్ట్రం	కార్మికుల సంఖ్య	బోర్డులో ఉన్న నిధులు (రూ.కోట్లు)	చేసిన ఖర్చు
కేరళ	20,45,538	2740.95	4399.78
ఆంధ్రప్రదేశ్	1992337	2549.20	569.63
గుజరాత్	683000	2013.84	545.29
ఉత్తరప్రదేశ్	15266278	8325.41	6366.64
త్రిపుర	11,7218	281.83	64.26
కర్ణాటక	3942711	9557.48	049.22
తెలంగాణ	1363443	3539.82	2192.24
తమిళనాడు	2085256	5511.96	2098.47
రాజస్థాన్	2974011	3925.23	2164.24

టిఎంసి గూండాల దాడిలో గాయపడ్డ మన్సూర్ ఆలామ్ మృతి

కోల్‌కతా : టిఎంసి గూండాల కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డ విద్యార్థి నాయకుడు మన్సూర్ ఆలామ్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈ నెల 15న ఉత్తర దినాజ్‌పూర్‌లోని చోప్రా వద్ద పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి నామినేషన్ వేయడం కోసం మార్గంగా వెళుతున్న సిపిఎం అభ్యర్థులు, మద్దతుదారుల ర్యాలీపై టిఎంసి గూండాలు కాల్పులతో తెగబడ్డారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డ మన్సూర్ ఆలామ్ సిలిగురిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. మన్సూర్ ఆలామ్ మృతదేహానికి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలామ్‌కు సిపిఎం పశ్చిమ బెంగాల్ నాయకులు నివాళులర్పించారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ట్విట్టర్ వేదికగా ఆలామ్‌కు నివాళులర్పించారు. ఆలామ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో టిఎంసి చేస్తున్న దాడులను, హింసా రాజకీయాలను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి హత్యా రాజకీయాలను ఓడించాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ICICI Home Finance | **కార్పోరేట్ కార్యాలయం:** ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, అందేరి -కుర్లా రోడ్, అందేరి (ఈస్ట్), ముంబాయి-400059, ఇండియా
శాఖ కార్యాలయం: 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి భవనం, మహాత్మాగాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010.

[రూల్ 8(6)కు నిబంధన చూచుట]
స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు.
సెక్యూర్డ్ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖపెట్టిన/చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఆ పద్ధతిన" మరియు "ఏదిఏమైనా ఆవిధంగా" విక్రయించబడునని సాధారణ ప్రజానీకం మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది, సంక్షిప్త వివరాల ప్రకారం దిగువ ఇవ్వబడినాయి;

క్ర. సం	రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీతలు/హామీదారులు/ చట్టబద్ధ వారసులు. లోను ఖాతా నం.	తెలిసిన రుణభారాలతో సెక్యూర్డ్ అస్సెట్(ల) వివరాలు, ఏవైనా	మొత్తం బకాయిలు	రిజర్వ్ ధర / బయానా మొత్తం	ఆస్థి తనిఖీ తేది మరియు సమయం	వేలం తేది & సమయం
(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)
1.	కెవిఎస్‌ఎస్‌ఎస్ ప్రసాద్ (రుణగ్రహీత), కె. ధరణి (సహ రుణగ్రహీత) లోను ఖాతా నం. LHVJW00001327445	కొత్త డో.నం.23-23-19, పాత డో.నం.23-23-19ఎ, కొత్త మూల్యాంకనం నం.125779, ఆర్ ఎస్.నం.118/3 మున్సిపల్ వార్డు నం.47 సత్యనారాయణ పురం విజయవాడ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కృష్ణాజిల్లా-520011	Rs. 50,29,233/- 20th June, 2023	Rs. 32,50,000/- / Rs. 3,25,000/-	July 10, 2023 11:00 AM-03:00 PM	July 13, 2023 02:00 PM-03:00 PM

మా వేలం ఏజెన్సీ గ్లోబ్‌టెక్ వెబ్‌సైట్ (URL Link-https://BestAuctionDeal.com) మీద ఆన్‌లైన్ వేలం నిర్వహించబడును. 12 జులై, 2023న సా.5.00 గం.లలోపు వరకు తదుపరి వడ్డీతో మొత్తం బకాయిలు చెల్లించుటకు తనాఖదారులు/నోటీసు ఇవ్వడమైనది లేకపోతే ఈ సెక్యూర్డ్ అస్సెట్స్ పైన షెడ్యూల్ ప్రకారం విక్రయించబడును.
కాగోరు బిడ్డర్(లు) బయానా (ఇఎండి) ఆర్‌టిజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) (కాలమ్ ఇ చూచుట) ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి భవనం, మహాత్మాగాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010 లేదా 12 జులై, 2023న సా.04:00 గం.లలోపు దాఖలు చేయాలి. దయచేసి గమనించండి, కాగోరు బిడ్డర్(లు) ఒకవేళ పైన పేర్కొన్న సమయం ప్రకారం వారి ఆఫర్ దాఖలు చేయనట్లయితే అప్పుడు టెండర్ డాక్యుమెంట్‌ల యొక్క సంతకంచేసిన కాపీ ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి భవనం, మహాత్మాగాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010 లేదా 12 జులై, 2023న సా.05:00 గం.లలోపు దాఖలు చేయాలి. బయానా డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) "ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్-ఆక్షన్" పేరిట ఏదైనా జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంక్ నుండి కృష్ణ, నందిగామ వద్ద చెల్లించాలి.
తనిఖీకి సంబంధించిన ఏదైనా తదుపరి వివరణలకు, వేలం నియమాలు మరియు షరతులు లేదా టెండర్ల దాఖలు, 7021072869 మీద ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ను లేదా మా సేల్స్ అండ్ మార్కెటింగ్ పాట్నర్ నెక్సెన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను దయచేసి సంప్రదించండి.
అధీకృత అధికారి ఎలాంటి కారణం చూపకుండా అన్ని బిడ్‌లు లేదా ఏదైనా తిరస్కారం చేసే హక్కు కలదు. విక్రయం వివరాణత్మక నియమాలు మరియు షరతులు, https://www.icicihfc.com/ దయచేసి చూడండి..

తేది: 23 జూన్, 2023
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
అధీకృత అధికారి
ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయం : సాధన హౌస్, 4 వ అంతస్తు, మహీంద్రా టవర్స్, పి.కె. కుర్నే చౌక్, వర్లి, ముంబాయి, మహారాష్ట్ర-400018
రీజినల్ కార్యాలయం మరియు బ్రాంచ్ కార్యాలయం : ఇంటి నెం.54-1/2డి, 4 వ అంతస్తు, శ్రీ సూర్య ప్రీమియర్, వెటర్నరీ కాలనీ, గుణదల, ఎన్.హెచ్-5వ రోడ్, విజయవాడ-520008.

స్థిరాస్తి 15 రోజుల వేలం కమ్ అమ్మకం కొరకు బహిరంగ ప్రకటన

సెక్యూరీటైజేషన్ మరియు రీకన్ స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్ఫోర్స్ మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు -2002 యొక్క 13 (4) విభాగం తోపాటు (ఇప్పటి నుంచి SARFAESI చట్టంగా పరిగణిస్తారు) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్ మెంట్) రూల్స్ -2002 యొక్క రూలు నెం. 8 మరియు 9 (ఇప్పటి నుంచి "రూల్సు"గా పరిగణిస్తారు) పరిధిలో సంక్రమించిన అధికారాలతో మెసర్స్ మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇప్పటి నుంచి" MRHFL" గా పరిగణిస్తారు) సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క అధీకృత అధికారిగా రుణ బకాయిలు రాబట్టు నిమిత్తం SARFAESI చట్టం 13 (4) విభాగం క్రింద సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క అధీకృత అధికారి భౌతికంగా స్వాధీన పరచుకున్న ఈ దిగువ వివరించిన సెక్యూర్డ్ ఆస్తి (స్థిర ఆస్తి) **"ఎక్కడ ఉన్నది అక్కడ పద్ధతి"** మరియు **"ఏమి ఉంటే అది పద్ధతి"** పైన విక్రయించుటకు నిర్ణయించినారని యావన్మంది ప్రజానీకమునకు మరియు సంబంధిత రుణగ్రహీతలు / సహ-రుణగ్రహీతలు /తనఖాదారులు / హామీదారులు వారి ప్రతినిధులు, దిగువ వివరించిన వారితో సహా సంబంధితులు అందరికి తెలియచేయడమైనది.

రుణగ్రహీత(లు)/ హామీదారు(లు) &చిరునామా	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తము	స్థిరాస్తి వివరణ	రిజర్వు ధర / ధరావతు / బిడ్ పెంపుదల మొత్తం	ఆస్తి తనిఖీ తేది & సమయం	వేలం తేది & సమయం & ప్రదేశం
లోను అకౌంట్ నెం XSEMV-JW00743637 విజయవాడ బ్రాంచి 1. **శ్రీ కడిమి సుబ్బారావు** (రుణగ్రహీత) 2. **కడిమి ధనలక్ష్మి** (సహ-రుణగ్రహీత) షిరిడి సాయి ఎన్‌క్లేవ్ ఫ్లాట్ నెం.A, గ్రౌండ్ ఫ్లోర్, GFAA సమీప డి. నెం. 16-1, ప్రస్తుత డి. నెం. 18-736, అన్నే అరుణా కన్వెన్షన్ సెంటర్ దగ్గర, కానూరు గ్రామం, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా-520007 ఫ్లాట్ నెం.302, విఘ్నేశ్వర టవర్స్, దుర్గా నగర్, కానూరు, పెనమలూరు మండలం, విజయవాడ రూరల్, కృష్ణాజిల్లా, ఆంధ్ర ప్రదేశ్-520007	02.02.2022 **రూ.18,28,217/-** వడ్డీ మరియు ఖర్చులు మొదలైనవి.	**షెడ్యూలు 'ఏ'** కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, కానూరు గ్రామం మరియు పంచాయితీ, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా పటమట సబ్ రిజిస్ట్రార్ అధికార పరిధిలోని ఆర్.ఎస్.నెం.187, విజయవాడ-గుంటూరు-తెనాలి-మంగళగిరి ఆర్ఎల్‌పి. నెం.249/2010 విజయవాడ అనుమతించిన ప్లాను ప్లాటు నెం.4,4ఎ లోని 150 చ.గజాలు లేదా 125.41 చ.మీటర్లు విస్తీర్ణపు సంపూర్ణమైన ఆస్తి సరి హద్దులు : **ఉత్తరం :** శృంగవరపు ఉమా ప్రవీణ్ గారి ఆస్థి : 45.0 అడుగులు, **దక్షిణం :** తుమ్మల వంశీకృష్ణ గారి ఆస్థి : 45.0 అడుగులు, **తూర్పు :** 33 అడుగుల వెడల్పు గల రోడ్డు : 30.0 అడుగులు, **పడమర :**గ్రూపు స్థలం : 30.0 అడుగులు ఈ సరిహద్దులు మధ్యనున్న 150 చ.గజాలు లేదా125.41 చ.మీటర్లు విస్తీర్ణపు స్థలం నందు అవిభాజ్యపు వాటా అనగా 18.75 చ.గజాలు లేదా 15.67 చ.మీటర్లు స్థలం మరియు **షెడ్యూలు 'బి'** పైన షెడ్యూల్-ఎ నందు చూపిన మొత్తం స్థలంలో నిర్మించబడిన కానూరు పంచాయితీ నందలి "షిరిడి సాయి ఎన్‌క్లేవ్" ఫ్లాట్ నెం. ఎ, జిఎఫ్ఎఎ గ్రౌండ్ ఫ్లోర్, సమీప డోర్ నెం.16-1 మరియు ప్రస్తుతం నెం.18-736 కలిగిన అనుమతించిన ప్లాను డి.డి. నెం.4-196/2012 తేది : 30-10-2012 వద్ద నున్న సంపూర్ణ ఆస్తి సరిహద్దులు : **ఉత్తరం :** శృంగవరపు ఉమా ప్రవీణ్ గారి ఆస్థి, **దక్షిణం :** తుమ్మల వంశీకృష్ణ గారి ఆస్థి, **తూర్పు :** కామన్ పార్కింగ్, **పడమర :** గ్రూపు స్థలం ఈ సరిహద్దులు మధ్య గల గ్రౌండ్ ఫ్లోర్, ఫ్లాట్ నెం.ఎ, 530 చ.అ.లు ప్లింతేరియా గల ప్లాటు, 132.0 చ.అ.లు కామన్ ఏరియా, 30 చ.అ.లు పార్కింగ్‌తో సహా గల ప్లాటు. సదరు ఫ్లాటుకు సంబంధించిన యావద్విశిష్ట కలప వగైరా సామాను సహా, అందలి ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, సదరు గృహ సముదాయమునకు సంబంధించిన కామన్ ఏరియాస్ మరియు కామన్ ఫెసిలిటీస్ అనగా మెట్లు, లిఫ్ట్, వాటర్, డ్రైనేజీ వగైరాలలో జాయింట్ వాడకపు హక్కులతో సహా మాకు గల యావత్తు ఎ & బి షెడ్యూల్ ఈజ్మెంట్ హక్కులు	**రూ. 14,94,720/-** / **రూ.1,49,472/-** / **రూ. 10,000/-**	**23/06/2023 నుండి 05/07/2023** వరకు ఉ.గం.10.00 నుండి సా.గం 5.30 వరకు	**12/07/2023** ఉ.గం. 10.30 నుండి సా.గం 5.30 వరకు M/s. మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి నెం.54-1/2డి, 4 వ అంతస్తు, శ్రీ సూర్య ప్రీమియర్, వెటర్నరీ కాలనీ, గుణదల, ఎన్. హెచ్-5వ రోడ్, విజయవాడ-520008.

నియమ నిబంధనలు :

(1) వేలంలో పాల్గొనదలచిన బిడ్డర్స్ ఆస్తి యొక్క రిజర్వు ధరలో పది శాతం (10%) ధరావతు (EMD) మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరున "డిమాండ్ డ్రాఫ్ట్ " రూపంలో విజయవాడ వద్ద చెల్లునట్లు **06.07.2023న** మ.గం.2.30 వరకు లేదా ఆలోగా చెల్లించవలెను. **(2)** ఆసక్తి కల బిడ్డర్స్ ఆస్తి/ఆస్తులు గురించి తనిఖీ చేసుకోవలెను మరియు వారు సంతృప్తి చెందవలెను మరియు ఆస్తి తనిఖీ గురించి మరియు ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్లు పరిశీలన నిమిత్తం బ్రాంచి మేనేజర్లు (సాద రమణ – అధీకృత అధికారి కమ్ టెరటరి మేనేజర్, సెల్ నెం.9642221444, T. శ్యామ్ కుమార్-బ్రాంచి మేనేజర్, సెల్ నెం : 9700108195, వై. భాను ప్రకాష్-బ్రాంచి మేనేజర్, సెల్ నెం.6281621113, Ch. క్రాంతి, బ్రాంచి మేనేజర్, సెల్ నెం.7095212111, N. అనిల్, లీగల్ మేనేజర్, సెల్ నెం.9291632239) ఉ.గం.10.00 నుండి సా.గం.4.00 మధ్య వారిని సంప్రదించవచ్చును. **(3)** గెలుపొందిన బిడ్డరు బిడ్ మొత్తములో ఇరవై అయిదు శాతం (25%) (EMD తగ్గించి) అదే రోజున వెంటనే లేదా మరుసటి పనిదినం మించకుండా ఎలా అయితే అలా తప్పక చెల్లించాలి. మరియు అతని పేరున అమ్మకం ఖాయం అయిన తర్వాత EMD ఇరవై అయిదు శాతం (25%) పైన సూచించినట్లుగా బిడ్ మొత్తమునకు వెంటనే సర్దుబాటు చేయబడుతుంది. పైన తెలిపినట్లుగా బిడ్ మొత్తములో ఇరవై అయిదు శాతం (25%) చెల్లించుటలో విఫలమైతే, EMD స్వాధీనపరచుకోబడుతుంది, మరియు ఆస్తి తిరిగి అమ్మకం చేయబడుతుంది. **(4)** గెలుపొందిన బిడ్డర్ బిడ్ మొత్తములో మిగిలిన మొత్తము డెబ్భై అయిదు శాతం (75%) అమ్మకం జరిగిన 15 రోజులు లోగా లేదా అధీకృత అధికారి/ సెక్యూర్డ్ క్రెడిటర్ వారిచే వారి విచక్షణాధికారంతో లిఖిత పూర్వకంగా అంగీకరించినచో పొడిగించిన కాలం లోగా చెల్లించాలి. నిర్ణీత కాలపరిమితి లోగా డిపాజిట్ మొత్తము చెల్లించుటలో విఫలమైతే, డిఫాల్టర్ పర్చేజర్ యొక్క సబ్-రూలు **(5)** ప్రకారం డిపాజిట్ స్వాధీనం చేసుకోబడుతుంది, అతనికి/ఆమెకు విక్రయించిన ఆస్తి పైన లేదా అందలి ఏదైన భాగం పైన ఎలాటి క్లెయిమ్ ఉండదు. (5) SARFAESI చట్టం పరిధిలో పాల్గొనుటకు డిపాజిట్ చేసిన ఏ సొమ్ము మొత్తమునకు వడ్డీ చెల్లింపు ఉండదు. **(6)** అధీకృత అధికారి వారికి తెలిసినంత వరకు సదరు ఆస్తి పై ఎలాంటి ఎంక్రెంబ్రెంసెస్ లేవు. బ్యాంకు వారికి తెలియని ప్రస్తుత మరియు భవిష్యత్తు ఎంక్రెంబ్రెంసెస్ లతోటి ఆస్తి/హక్కులు విక్రయించబడతాయి. అందువలన తమ బిడ్ దాఖలు చేయుటకు ముందుగా ఆస్తికి సంబంధించి ఎంక్రెంబ్రెంసెస్/ క్లెయిమ్స్/ హక్కు/బకాయిలు ఉన్నవేమో తెలుసుకొనుటకు స్వంత విచారణ చేసుకోవలసినదిగా పాల్గొనగోరు బిడ్డర్స్ నకు సూచించడమైనది. **(7)** అమ్మకపు ఆస్తి/ఆస్తులు నకు సంబంధించిన ఏదైన చార్జి, హక్కు ఎంక్రెంబ్రెంసెస్ ఆస్తి పన్ను లేదా ఏదైన ఇతర బకాయిలు ప్రభుత్వం లేదా ఏదైన ఇతర సంస్థకు చెల్లించవలసిన వాటికి అధీకృతఅధికారి/సెక్యూర్డ్ క్రెడిటర్ బాధ్యత వహించరు. **(8)** గెలుపొందిన బిడ్డర్ చట్ట ప్రకారం వర్తించు రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటి వగైరా వంటి కన్వేయన్స్ లు భరించాలి. **(9)** ఎలాంటి కారణములు చూపకుండా అమ్మకం ను అంగీకరించుటకు/తిరస్కరించుటకు/వాయిదా వేయుటకు లేదా రద్దు చేయుటకు మరియు ఎలాంటి కారణములు చూపకుండా అమ్మకం నియమ నిబంధనలు మార్పు చేయుటకు అధీకృత అధికారి హక్కు కలిగి ఉన్నారు. **(10)** ఆస్తి/ఆస్తులు పైన నిర్ధారించిన రిజర్వు ధర కంటే తక్కువకు విక్రయించరు. **(11)** ఆస్తి/ఆస్తులు **"ఎక్కడ ఉన్నవి అక్కడ" "ఏమి ఉంటే అవి"** మరియు **"అక్కడ ఏమి ఉంటే అవి"** పద్ధతి పైన వేలం వేస్తారు. **(12)** పైన వివరించిన స్తిర ఆస్తి/ఆస్తులు అధీకృత అధికారి వారిచే భౌతికంగా స్వాధీన పరచుకున్నవి, వేలంలో కొనుగోలు చేసిన కొనుగోలుదారునికి ఆయనే అందచేస్తారు. **(13)** ఆసక్తి కల బిడ్డర్ వేలం లో పాల్గొను సమయం లో గుర్తింపునకు ఏదైన ఒక రుజువు అనగా ఆధార్ కార్డ్, పాస్ పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, రేషన్ కార్డ్, ఓటరు ఐ.డి కార్డ్, పాన్ కార్డ్ వగైరా కలిగి ఉండాలి. **(14)** నియమావళి ప్రకారం చెల్లింపు చేసిన కొనుగోలుదారు/విజయము పొందిన బిడ్డరు పేరున మాత్రమే సేల్ సర్టిఫికేట్ జారీచేయబడుతుంది మరియు మరే ఇతర పేరున జారీచేయబడదు. సేల్ సర్టిఫికేట్ నిర్వర్తించుటకు అవసరమైన అన్ని స్టాంపు డ్యూటి, రిజిస్ట్రేషన్ చార్జీలు మరియు అన్ని ఇతర సంబంధిత ఫీజులు, సుంకాలు పన్నులు వగైరా కొనుగోలుదారే భరించవలెను. **(15)** సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్ఫోర్స్ మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు -2002 పరిధిలోని నియమాలు/షరతులు/నిర్ధారించిన వాటికి లోబడి అమ్మకం ఉంటుంది. **(16)** గెలుపొందిన బిడ్డరు/కొనుగోలుదారు 1961 ఆదాయపన్ను చట్టం సెక్షన్ 19(1-ఎ) ప్రకారం అమ్మకం వసూలు పైన TDS 1% మినహాయించి & దానిని ఫారం- 26 QB చలాను ద్వారా చెల్లించాలి మరియు TDS యొక్క ఒరిజినల్ రశీదును MRHFL వారికి దాఖలు చేయాలి. **(17)** చట్టం యొక్క 13వ విభాగం ఉప విభాగం (8) పరిధిలో సెక్యూర్డ్ఆస్తులు విడిపించుకొనుటకు తగిన సమయం అందుబాటులో ఉంటుందని రుణగ్రహీతకు తెలియచేయటమైనది. **(18)** అమ్మకం ప్రకటన వెబ్ సైట్ **www.mahindrahomefinance.com** నందు అప్ లోడ్/ప్రచురించుట చేయటమైనది. ఇతర వివరాలు కొరకు పైన తెలిపిన బ్రాంచి ఆఫీసు చిరునామా వద్ద టెరటరి మేనేజర్/అధీకృత అధికారి మరియు బ్రాంచి మేనేజర్ వారిని సంప్రదించండి.

ప్రదేశం: విజయవాడ
తేది: 23-06-2023
సం/- అధీకృత అధికారి
మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

కొవిన్ డేటా లీక్ కేసులో ఇద్దరి అరెస్టు

న్యూఢిల్లీ : కొవిడ్ వ్యాక్సినేషన్‌కు ఉద్దేశించిన కొవిన్ పోర్టల్‌లోని సున్నితమైన సమాచారం లీకైందని ఇటీవల వచ్చిన వార్తలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇద్దర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఒకరు బిహార్‌కు చెందిన వ్యక్తి. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్‌కు చెందిన ఇంటెలిజెన్స్ విభాగం ఇతడిని అదుపులోకి తీసుకుంది. ప్రముఖులు, ఉన్నతాధికారులకు సంబంధించిన సమాచారాన్ని ఈ వ్యక్తే సోషల్ మీడియాలో లీక్ చేసినట్లు అనుమానిస్తున్నారు. ఆరోగ్యకార్యకర్తగా ఉన్న తన తల్లి నుంచి ఈ వ్యక్తి వివరాలు సంపాదించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఆమెను కూడా పోలీసులు విచారిస్తున్నారు. కొవిడ్ వ్యాక్సినేషన్ కోసం కొవిన్ పేరిట ప్రత్యేక పోర్టల్‌ను కేంద్ర ప్రభుత్వం వినియోగిస్తోంది. ఫోన్ నంబర్, ఆధార్ నంబర్ వివరాలు నమోదు చేసి పౌరులు టీకా తీసుకొంటున్నారు. ఇందులో వ్యక్తుల పేర్లు, ఆధార్ వివరాలు, ఫోన్ నంబర్‌తో పాటు ఏయే తేదీల్లో ఎక్కడ వ్యాక్సిన్ తీసుకొన్నారు? వంటి సమాచారం ఉంటుంది. అయితే, ఇలాంటి కీలక సమాచారం మెసెంజర్ యాప్ టెలిగ్రామ్‌లో ఇటీవల వెలుగు చూడటం కలకలం రేపింది. ఇలా ప్రముఖుల పేర్లు, ఫోన్ నంబర్లు, ఆధార్, పాన్ తదితర వివరాలు ప్రత్యక్షం కావడంపై ఈ నెల 12న కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పందించారు. డేటా లీక్‌ను తిప్పి కొట్టారు. ఓటీపీ తో మాత్రమే పోర్టల్‌లోని డేటాను చూడగలమని.. దాన్నుంచి డేటా లీకయ్యే అవకాశమే లేదని గొప్పగా చెప్పారు. ఓటీపీ లేకుండా పోర్టల్ లోని సమాచారాన్ని ఏ బాట్‌లోనూ షేర్ చేయలేమని తెలిపారు. అయితే ఈ డేటా లీక్ వ్యవహారంపై ఢిల్లీ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. ఇద్దరి అరెస్టు చేశారు. అంటే కేంద్ర మంత్రి ఈ నెల 12న చెప్పిందని తప్పని, కొవిన్ నుంచి డేటా లీక్ అయిన వార్తే నిజమని విశ్లేషకులు భావిస్తున్నారు.

'పశువుల' బిల్లు ఉపసంహరణ

న్యూఢిల్లీ : పశువుల దిగుమతి, ఎగుమతికి వీలు కల్పిస్తూ రూపొందించిన ముసాయిదా బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీనిపై జంతు ప్రేమికులు, కార్యకర్తలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లు పశు హింసకు దారి తీస్తుందని, జన్యు సమీకరణను నాశనం చేస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లుపై మరింత అవగాహన కు రావాల్సి ఉందని, వ్యాఖ్యలు- సూచనలు చేయడానికి సమయం అవసరమని పశు సంవర్ధక, డెయిరీ శాఖ తెలిపింది. ప్రతిపాదిత ముసాయిదా బిల్లులో జంతు సంక్షేమానికి సంబంధించి సున్నితమైన, భావోద్వేగాలతో కూడిన అంశాలు ముడిపడి ఉన్నాయంటూ ఆందోళనలు వ్యక్తమయ్యాయని, అందువల్ల దీనిపై విస్తృత సంప్రదింపులు అవసరమని వివరించింది.

మణిపూర్ పరిస్థితిపై రేపు అఖిలపక్షం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితులపై చర్చించేందుకు ఈనెల 24న అఖిలపక్ష సమావేశాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్వహించనుంది. మణిపూర్‌లో మే 3న ప్రారంభమైన హింసకాండా నేటికీ కొనసాగుతోంది. ఈ హింసాకాండలో ఇప్పటికే వందలాది మంది మరణించారు. దాదాపు 60 వేల మంది శరణార్థులయ్యారు. వందలాది ఇళ్లు, దుకాణాలు దగ్ధం అయ్యాయి. ఇంటర్‌నెట్ పునరుద్ధరణ కాలేదు. దాదాపు 50 రోజులు కావస్తుంది. నేటికి హింసకాండా కొనసాగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పందించింది. మణిపూర్‌లో పరిస్థితిపై చర్చించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా జూన్ 24న మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారని హోం మంత్రిత్వ శాఖ ఒక ట్వీట్‌లో పేర్కొంది.

కొత్త దార్శనికత కావాలి

- పారిస్ సదస్సులో నేతల స్పష్టీకరణ
- ప్రకృతి విపత్తులతో కునారిల్లే పేద దేశాలకు ప్రపంచ బ్యాంక్ అండగా నిలవాలి
- అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు కొంత నష్టాన్ని భరించాలన్న చైనా

పారిస్ : ప్రకృతి విపత్తులతో తీవ్ర విధ్వంసాన్ని ఎదుర్కొంటున్న దేశాలకు సహాయంగా పలు చర్యలను ప్రపంచ బ్యాంక్ చీఫ్ ప్రకటించారు. రుణాలు తీసుకున్న పేద దేశాల చెల్లింపులను తాత్కాలికంగా నిలుపుచేయడంతో సహా పలు చర్యలు అందులో వున్నాయి. వాతావరణ మార్పులు, తద్వారా ఏర్పడుతున్న అంతర్జాతీయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు పేద, సంపన్న దేశాల మధ్య కొత్త ఒప్పందం కుదుర్చుకునేందుకు పారిస్‌లో గురువారం గ్లోబల్ ఫైనాన్సింగ్‌పై సదస్సు ప్రారంభమైంది. ఉక్రెయిన్‌లో యుద్ధం, వాతావరణ సంక్షోభం, పెరుగుతున్న అసమానతలు, తగ్గుతున్న అభివృది గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచ బ్యాంక్, ఇతర బహుళ ఆర్థిక సంస్థలు కొత్త దార్శనికతను రూపొందించుకోవాల్సిన అవసరముందని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ సదస్సుకు ఆతిథ్యమిస్తున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ మాట్లాడుతూ, కార్య రంగంలోకి దిగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. లేదా నమ్మకం పోగొట్టుకుంటామన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో వాతావరణ మార్పులపై ప్రధానంగా చర్చ జరుగుతోంది. రుణాల పునర్వ్యవస్థీకరణ, పేదరికాన్ని అంతమొందించడం కూడా ఎజెండాలో భాగంగా వున్నాయి. కొత్త అంతర్జాతీయ ఫైనాన్స్ ఎజెండాకు ఊపును, ఉత్తేజాన్ని ఇచ్చేందుకు ప్రపంచ నేతలు పారిస్‌లో సమావేశమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల అధినేతలు, ఆర్థిక నిపుణులు, అంతర్జాతీయ సంఘాల ప్రతినిధులు, పౌర సమాజ సంఘాల ప్రతినిధులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. వాతావరణ మార్పులు, అందుకు సంబంధించిన ఆర్థికాంశాలపై ఆరు రౌండ్ టేబుల్స్‌లో చర్చలు కొనసాగుతున్నాయి. మొత్తంగా 40మంది నేతలు, అంతర్జాతీయ సంఘాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. వీరిలో చైనా ప్రధాని, బ్రెజిల్ అధ్యక్షుడు, ఆఫ్రికా ప్రాంతానికి చెందిన నేతలు 12మందికి పైగా వున్నారు. తక్కువ ఆదాయాలు గల దేశాలకు సంక్షోభ నివారణకు సహాయం అందించడం, యుద్ధానంతర ఆర్థిక వ్యవస్థల సంస్కరణలపై ప్రధానంగా చర్చ జరుగుతోంది. జి 20, కాప్, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్, ఐక్యరాజ్య సమితి వంటి సంస్థల్లో నలుగుతున్న పలు చొరవలను ఎలా అమలు చేయాలనే దానిపై ఉన్నత స్థాయి ఏకాభిప్రాయాన్ని తీసుకురావడం ద్వారా వాతావరణ మార్పులను ఎదుర్కొనడానికి నిధులను ఖర్చు పెట్టడం వంటి అంశాలపై చర్చ జరుగుతోంది. వర్ధమాన దేశాలకు అంతర్జాతీయ భద్రతా వ్యవస్థను అందించడంలో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ విఫలమైందన్నది సుస్పష్టమని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ చెప్పారు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కాలం చెల్లిందని, సరిగా పని చేయడం లేదని, అన్యాయంగా వ్యవహరిస్తోందని అన్నారు. వాతావరణ ముప్పలను ఎదుర్కొనే వర్ధమాన దేశాలకు మరిన్ని పెట్టుబడులను సమకూర్చడానికి ప్రపంచ బ్యాంక్ వంటి బహుముఖ అభివృద్ధిబ్యాంకులకు మద్దతునివ్వడానికి నేతలు సిద్ధంగా వున్నారని ముసాయిదా డాక్యుమెంట్ పేర్కొంటోంది. గురువారం ప్రపంచ బ్యాంక్ కొత్త అధ్యక్షుడు అజయ్ బంగా సదస్సులో మాట్లాడుతూ, ఒక 'టూల్ కిట్'ను ప్రతిపాదించారు. రుణాలను తిరిగి చెల్లించడంలో విరామం, అత్యవసర అవసరాల కోసం నిధులను మళ్లించేందుకు దేశాలకు వెసులుబాటు ఇవ్వడం, అభివృద్ధి ప్రాజెక్టులకు సహాయం చేయడానికి కొత్త బీమా రకాలను అందించడం, మరింత అధునాతనమైన అత్యవసర స్పందనా వ్యవస్థలను రూపొందించడంలో ప్రభుత్వాలకు సాయపడడం వంటి అంశాలు అందులో వున్నాయి. బలమైన ఆర్థిక భద్రతా వ్యవస్థ ఇప్పుడు మనకు అవసరమని ఇథియోపియా ప్రధాని అబే అహ్మద్ సమావేశం లో పేర్కొన్నారు. మరిన్ని నిధులను విడుదల చేయాల్సిన అవసరముందన్నారు. ఆఫ్రికా దేశాలు గతంలో ఎన్నడూ లేనంతగా నిధుల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయన్నారు. చైనా ప్రధాని మాట్లాడుతూ, కొన్ని నష్టాలను ప్రపంచ బ్యాంక్ లేదా అంతర్జాతీయ ద్రవ్య నిధి వంటి అంతర్జాతీయ సంస్థలు భరించాలని సూచించారు. ఈ నష్టాలను భర్తీ చేయడానికి సంపన్న దేశాలు, సంస్థలు విముఖంగా వున్నాయన్నారు. రాబోయే 18-24 మాసాలకు రోడ్ మ్యాప్‌లను రూపొందించడం ఈ సదస్సు లక్ష్యంగా పెట్టుకుంది. రుణాల రిలీఫ్ నుండి వాతావరణ సంక్షోభాల నివారణకు ఆర్థిక నిధులు అందించడం వరకు పలు అంశాలపై ప్రణాళికలు రూపొందించాల్సి వుంది. సదస్సు ఎజెండాలోని పలు అంశాలపై వర్ధమాన దేశాల గ్రూపు నుండి సూచనలు కోరారు.

నేడు ప్రతిపక్షాల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

దూరంగా ఉన్నాయి. వైసిపి, టిడిపి పార్టీలు తొలి నుంచి బిజెపితో అంటకాగుతున్నాయి. పార్లమెంట్‌లో అనేక సందర్భాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వైసిపి, టిడిపిలు బిజెపికి మద్దతు తెలిపాయి. మరోవైపు బిజెపిపై పోరాడుతున్నట్లు చెబుతున్న బిఆర్ఎస్ కూడా ఈ సమావేశానికి దూరంగా ఉంది. అలాగే బిజెడి, బిఎస్‌పి, జెడిఎస్ వంటి పార్టీలు కూడా ఈ సమావేశానికి దూరంగా ఉన్నాయి.

ఆప్ షరతు : ప్రతిపక్షాల సమావేశానికి ఒక రోజు ముందు అంటే బుధవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీలో అధికారుల బదిలీలు, నియామకాల్లో లెఫ్టినెంట్ గవర్నర్‌ను తుది మధ్యవర్తిగా పేర్కొంటూ కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ తమకు మద్దతివ్వకుంటే ప్రతిపక్షాల భేటీకి హాజరుకాబోమని ఆప్ షరతుపెట్టింది. పాట్నా సమావేశంలో ఢిల్లీ ఆర్డినెన్స్‌కి తొలి సమస్యగా ప్రాధాన్యత ఇచ్చి చర్చించాలంటూ ఆమాద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ అంతకుముందు లేఖ రాశారు. ఢిల్లీలో అధికారుల బదిలీలు, నియామకాల్లో లెఫ్టినెంట్ గవర్నర్‌ను తుది మధ్యవర్తిగా పేర్కొంటూ కేంద్రం ఆర్డినెన్స్ తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

MOTILAL OSWAL HOME LOANS
మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: మోతిలాల్ ఓస్వాల్ టవర్, రహిమ్‌తుల్లా సయాని రోడ్, ఎస్‌టి డిపో ఎదురుగా, ప్రభాదేవి, ముంబాయి-400025. టెలి: (022)47189999 వెబ్‌సైట్: www.mothilaloswalhf.com, ఇమెయిల్: hfquery@mothilaloswal.com

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (సదరు రూల్) యొక్క రూల్ 3(1)తో చదువగల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (సదరు చట్టం) యొక్క సెక్షన్ 13(2) క్రింద, సదరు రూల్ యొక్క రూల్ 3తో చదువగల సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఆధీకృత అధికారి సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసులను జారీచేసి, వారికి జారీచేయబడిన సదరు డిమాండ్ నోటీసుల్లో పేర్కొన్న రుణ మొత్తంను తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీతలు, హామీదారులను కోరినారు. పై నోటీసుకు సంబంధించి, డిమాండ్ నోటీసు తేది(ల) నుండి చెల్లింపులుచేయువరకు తదుపరి వడ్డీతోపాటు, దిగువ సూచించిన మొత్తాలను, ఈ నోటీసు ప్రచురిత 60 రోజుల్లోగా అన్ని పార్టీలకు చెల్లించుటకు మరోసారి కోరబడుచున్నది. డిమాండ్ నోటీసు తేదీన రుణగ్రహీత(ల) బకాయి మొత్తం మరియు రుణ మొత్తంను తిరిగి చెల్లించుటకుగాను ఆఫర్‌చేసిన సెక్యూరిటీ యొక్క వివరాలు క్రింది విధంగా ఉన్నవి:

క్ర. సం	రుణ ఒప్పంద నెం./రుణగ్రహీత(ల)/ సహ-రుణగ్రహీత(ల)/సహ-అప్లికెంట్ పేరు/హామీదారుల యొక్క పేరు	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	సెక్యూర్డ్ అసెట్(ల) వివరణ (స్థిరాస్తి/లు)
1	**LXGUN00417-180067409/** ఆదినారాయణ పోటూరి/లక్ష్మి కట్టెర	08-జూన్-23/ రూ॥9,16,695/- (తొమ్మిది లక్షల పదహారు వేల ఆరు వందల తొంభై ఐదు రూపాయలు మాత్రమే)	డో.నం.149, గొల్లపాడు గ్రామ కంఠం, శ్రీ సీతారామ స్వామి గుడి వద్ద, గొల్లపాడు గ్రామ పంచాయతీ, ముప్పల్ల మండలం, గుంటూరు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ 522408
2	**LXGUN04119-200075801/** పోరుమల్ల శివ నాగేశ్వరరావు/ పోరుమల్ల నాగ రాధిక	08-జూన్-23/ రూ॥5,96,941/- (ఐదు లక్షల తొంభై ఆరు వేల తొమ్మిది వందల నలభై ఒక రూపాయలు మాత్రమే)	సర్వే నం.34/2, మూల్యాంకనం నం.57-143/4, గోరంట్ల రామాలయం గుడి వద్ద, గుంటూరు మూల్యాంకనం నం.135176, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ 522034.
3	**LXMOVIJAYW921-220626750/** నాగరాజు అంగిరేకుల/పార్వతి అంగిరేకుల	13-ఏప్రిల్-23/ రూ॥14,83,762/- (పద్నాలుగు లక్షల ఎనభై మూడు వేల ఏడు వందల అరవై రెండు రూపాయలు మాత్రమే)	మూల్యాంకనం నం.1174, ఎస్‌వై.నం.60-4 పేరకలపుడి గ్రామ పంచాయతీ దుగ్గిరాల మండలం 0 0 జెడ్‌పిహెచ్ హై స్కూల్ వద్ద 522305 గుంటూరు ఆంధ్రప్రదేశ్.

పైన చెప్పినట్లుగా ఎహెచ్‌ఎఫ్‌సిఎల్‌కు చెల్లింపులుచేయుటలో ఒకవేళ సదరు రుణగ్రహీతలు విఫలం చెందిన పక్షంలో, ఎహెచ్‌ఎఫ్‌సిఎల్ చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు వర్తించు రూల్స్ క్రింద ఖర్చులు మరియు ఫలితంగా సదరు రుణగ్రహీతల పూర్తి బాధ్యత పై సెక్యూర్డ్ అసెట్స్ పై చర్యలు తీసుకొంటుంది. సదరు రుణగ్రహీతలు ఎహెచ్‌ఎఫ్‌సిఎల్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతిలేనిదే అమ్మకం, లీజు లేదా ఇతర రూపాలలో పైన చెప్పిన ఆస్తుల బదిలీ నుండి చట్టం క్రింద నిషేదింపబడినారు. సదరు చట్టం లేదా దాని క్రింద రూపొందించిన రూల్స్ యొక్క నియమాల వివాదాలు లేదా సమస్యలను తక్కువచేయు ఎవరైనా వ్యక్తి, చట్టం క్రింద ఇవ్వబడినట్లుగా జేలు మరియు/లేదా జరిమానాకి ఆస్కారం ఉంటుంది.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
తేది: 23.06.2023
సం/-
ఆధీకృత అధికారి
(మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్)
***అనువాదంలో వ్యత్యాసం ఉన్నట్లయితే, ఇంగ్లీష్ వర్షన్‌ను పరిగణించగలరు.**

పార్లమెంటును క్రోనీ కేపిటలిస్టు షెల్టర్‌గా మార్చేశారు

- మోడీపై విజయరాఘవన్ ధ్వజం

త్రిస్సూర్: భారత పార్లమెంటును మోడీ క్రోనీ కేపిటలిస్టు షెల్టర్‌గా, మతతత్వ వాదుల షోరూమ్‌గా మార్చేస్తున్నారని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ విజయరాఘవన్ విమర్శించారు. పార్లమెంటులో మోడీ ప్రభుత్వంపై చేసిన విమర్శలు రికార్డుల నుంచి తొలగించబడతాయి. మోడీని పొగిడితే చాలు అన్న పరిస్థితి నెలకొంది. త్రిసూర్‌లో ఇఎంఎస్ స్మృతిలో 'కుప్పకూలుతున్న భారత ప్రజాస్వామ్యం' అన్న అంశంపై ఏర్పాటైన సదస్సులో విజయరాఘవన్ ప్రసంగిస్తూ, దేశంలో నేడు చాలా ప్రమాదకర పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రజాస్వామిక విలువలు, ప్రజాస్వామిక సంస్థలను నాశనం చేస్తున్నారు. సార్వభౌమాధికారాన్ని, ప్రజాస్వామ్యం, లౌకిక విలువలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోందని, కార్పొరేట్లు, మతోన్మాద ఫాసిస్టు విధానాలు కొనసాగుతున్నాయని ఆయన అనాన్రు. కేరళలో సిపిఐ(ఎం), వామపక్షాలకు వ్యతిరేకంగా పెద్దయెత్తున ప్రచారం, కుట్రలు సాగుతున్నాయని అన్నారు.

ఫ్రాన్స్ చేరుకున్న క్యూబా అధ్యక్షుడు

పారిస్ : యూరోపియన్ దేశాల పర్యటనలో భాగంగా క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కానెల్ ఫ్రాన్స్‌కు చేరుకున్నారు. సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిక్‌తో భేటీ అనంతరం బుధవారం రాత్రి 9.57 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) ఫ్రాన్స్ చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. ఫ్రాన్స్‌లో క్యూబా రాయబారి ఒట్టో వైలంట్ ఫ్రియాస్, ఐక్యరాజ్యసమితి విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ (యుఎన్ఎస్‌సిఒ)లో క్యూబా ప్రతినిధి యహిమాలు ఆయనకు స్వాగతం పలికారు. క్యూబా అధ్యక్షుడు జూన్ 22, 23 తేదీల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ఏర్పాటు చేసిన నూతన గ్లోబల్ ఫైనాన్షియల్ ఒప్పందం సమావేశానికి హాజరుకానున్నట్లు క్యూబా అధ్యక్ష కార్యాలయం ప్రకటించింది. క్యూబాలో సంఘీభావ ఉద్యమంపై స్నేహితుల తో మరియు సెర్బియా అధ్యక్షునితో చర్చించామని మిగుల్ డియాజ్ కానెల్ ట్విటర్‌లో పేర్కొన్నారు. సెర్బియాలోని అమర వీరులకు నివాళులు అర్పించామని అన్నారు. సెర్బియా ఉప ప్రధాని, రక్షణ మంత్రి, సెర్బియా సాయుధ దళాల జనరల్ స్టాఫ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని అన్నారు. అధ్యక్షులు మిగుల్ డియాజ్ కానెల్, అలెగ్జాండర్ వుసిక్‌ల మధ్య చర్చలు ఫలవంతమయ్యాయని క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ పేర్కొన్నారు. క్యూబా, సెర్బియాల మధ్య చారిత్రాత్మక స్నేహ సంబంధాలను ధృవీకరించాయని, అలాగే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు.

మీ కోసం

నెయ్యి కరగబెట్టినప్పుడు గిన్నె అడుగుభాగంలో పేరుకుపోయిన జిడ్డు వదలాలంటే ఆ గిన్నెలో కొంచెం నీళ్లు ఒక చెంచా సోడా ఉప్పు వేసి ఐదు నిమిషాలు బాగా మరగబెడితే జిడ్డు త్వరగా వదులుతుంది.

జీవన సౌరభం

చేసే పనిలో అడ్డంకులు వస్తే ఆపాల్సింది పని కాదు.. ప్రయత్నించే విధానం.

మారిన ఊరు

హైదరాబాదులో వైద్యునిగా సేవలు అందిస్తున్న ప్రశాంత్ వేసవి సెలవుల్లో తన సొంత గ్రామానికి వచ్చాడు. ఊరిలో అడుగుపెట్టగానే ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు, ప్లాస్టిక్ కవర్లు దర్శనమిచ్చాయి. కొంతమంది రోడ్డు పక్కన మల విసర్జన చేస్తూ కనిపించారు. ఎక్కడా చెట్లు లేవు. ఇది తన ఊరేనా! అనే అనుమానం వచ్చింది. ఇలా ఏవేవో ఆలోచనలతో ఇంటికి చేరుకున్నాడు. ప్రయాణం చేసి అలసిపోయిన ప్రశాంత్ భోజనం చేసి పడుకున్నాడు. కానీ నిద్ర పట్టలేదు. పచ్చని చెట్లతో కడిగిన ముత్యంలా ఉండే ఒకప్పటి తన ఊరు ఇలా కలుషితమైందనే బాధ మనసును తొలిచింది. ఏ విధంగానైనా తన ఊరును బాగుపరిచి పర్యావరణ సహితంగా మార్చాలి అనుకున్నాడు. మరుసటి రోజు గ్రామస్తులతో, పెద్దలు, ప్రజాప్రతినిధులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశాడు.

'మీరందరూ కూడా నాకు మూడు హామీలు ఇవ్వాలి. అలా చేస్తామంటేనే నేను ఉచితంగా మందులు ఇస్తా, వైద్య సేవ చేస్తా' అని ప్రశాంత్ అన్నాడు.

'డాక్టర్ గారూ! మీరు ఏదీ చేసినా ఊరి ప్రజలకు మంచి చేస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్యం అందడం కష్టం. అది మీరు మాకు ఉచితంగా అందిస్తామన్నారు. కాబట్టి మేమంతా మీకు హామీ ఇస్తున్నాం.' ముక్త కంఠంతో అన్నారు గ్రామస్తులంతా.

'మొదటిది మీరందరూ ప్రతి ఇంటికి మరుగుదొడ్డి కట్టుకోవాలి. ఆరుబయట ఎవరూ మలవిసర్జన చేయకూడదు. రెండవది ప్లాస్టిక్ కవర్లు వాడకూడదు. మూడవది ఎక్కడ ఖాళీ ప్రదేశం కనిపించినా అక్కడ అందరూ కలిసి చెట్లను నాటాలి' అని అన్నాడు.

గ్రామస్తులు అందరూ సరేనని హామీ ఇచ్చారు. ఊరిలో ఉన్న చెత్తను తొలగించారు. ఇంటి ముందు మరుగుదొడ్లు నిర్మించుకున్నారు. ఊరి బయట కొన్ని మరుగుదొడ్లు కట్టారు. రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. బాధ్యతగా ప్రతి రోజూ వాటికి నీళ్లు పోసి పెంచారు. కొద్ది నెలల్లోనే తన గ్రామం చక్కటి పర్యావరణంతో విలసిల్లింది. ఆరు నెలల తర్వాత డాక్టర్ ప్రశాంత్ ఊరికి వచ్చారు. గ్రామంలో వచ్చిన మార్పుకు సంతోషించారు. తను మాట ఇచ్చినట్టుగానే ప్రతి నెలా ఊరిలో వైద్యశిబిరం నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఇవ్వసాగారు.

- యాడవరం చంద్రకాంత్ గౌడ్
94417 62105



సరైన నీడ ఏది?

చిన్నారులూ, ఇక్కడ గిఫ్ట్ బాక్సు ఉంది. దాని పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో దీని సరైన నీడను కనిపెట్టండి.

జవాబు: 4

నేను గీసిన బొమ్మ

- పి. దీక్ష,
2వ తరగతి,
ఎం.పి.యు.పి. స్కూలు, రంగాపురం,
ముదినేపల్లి,
ఏలూరు జిల్లా.

అమానుష కృత్యం ..!

ఊళ్లో కోళ్లన్నీ తెగులొచ్చి చచ్చిపోతున్నాయి. మేకలు, గొర్రెలు కూడా మేత మేయడం లేదు.. బర్రెలు పాలివ్వడం లేదు.. ఇళ్లల్లో పిల్లలకి, పెద్దలకీ ఏదో ఒక సుస్తీ చేస్తోంది. ఊళ్లో ఒకాయన ఉన్నట్లుండి చనిపోయాడు. ఏ రోగమూ రొష్టు లేదు.. అయినా ఎందుకిలా జరుగుతోంది? ఇక ఆలస్యం చేయకూడదు.. అనుకుంటూ ఊరంతా ఒక్కటయ్యారు. 'మన ఊరికి ఎవరో చేతబడి చేశారు..' అన్నారొకరు. ఎవరై ఉంటారు? ఆరా తీశారు మరొకరు. 'ఇంకెవరు ఊరి చివర గుడిసెలో ఉన్న యాదయ్య, అమృతే ఈ పని చేశారు' అంటూ దోషులెవరో నిర్ధారించేశారు ఇంకొకరు. అలా ఊరందరూ ఏకమై ఆ దంపతుల ఇంటికి వెళ్లి నానా దుర్భాషలాడుతూ వారిని రోడ్డుమీదకి ఈడ్చుకొచ్చారు. కాళ్లు, చేతులు తాళ్లతో కట్టేసి ఊరి మధ్యలో చెట్టుకు నిట్టనిలువునా వేలాడదీశారు. గంట, రెండు గంటలు కాదు.. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వారు అలా గాల్లో ఊగులాడుతూనే ఉన్నారు.

ఈ సమయంలో గ్రామస్తులంతా వారిపై కర్రలతో మోదారు. రాళ్లు విసిరారు. చేతబడి చేశారన్న నెపంతో అమాయకులను, నిరక్షరాస్యులను రోజంతా ఇలా హింసించింది ఎక్కడో కాదు.. మన పక్క తెలుగు రాష్ట్రం తెలంగాణలోనే.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం కొలుకు గ్రామంలో జూన్ 17న జరిగిందా దారుణం.

'వాళ్లు మమ్మల్ని ఏమీ అడగలేదు.. ఒప్పుకోండని కొడుతూనే ఉన్నారు. రక్తం కారుతున్నా మమ్మల్ని కిందకి దించలేదు. అంతసేపు అలా గాల్లో ఊగుతూనే ఉన్నాం. చాలా భయమేసింది' అంటూ అమృత (35) ఆ ఘటన గురించి చెబుతున్నప్పుడు ఆ మాటల్లో వణుకు స్పష్టంగా కనిపిస్తోంది. 'శనివారం తెల్లవారుజామునే వారు మా ఇంటికి వచ్చారు. మేము చేతబడి చేశామని, ఒప్పుకోండని కొట్టారు. ఆ తరువాత పంచాయతీ ఆఫీసుకు తీసుకువచ్చారు. అక్కడ మాతో పాటు ఊళ్లోనే ఉంటున్న శ్యామలమ్మను కూడా చెట్టుకు కట్టేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు మా మీద కర్రలతో, రాళ్లతో దాడి చేస్తూనే ఉన్నారు. పోలీసులు వచ్చిన తరువాతే ఆ హింస ముగిసింది' అని జీర గొంతుతో అమృత భర్త యాదయ్య (40) చెబుతున్నాడు.

'మేము ఏ మంత్ర విద్య చేయడం లేదని ఎంత చెప్పినా వాళ్లు ఒప్పుకోలేదు. పైగా ఒప్పుకోకపోతే పెట్రోలు పోసి తగలబెట్టేస్తామన్నారు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో.. నొప్పి భరించలేక చేతబడి చేశామని ఒప్పుకున్నాం' అంటున్న అమృత 'మేము ఎస్‌సి కమ్యూనిటీకి చెందిన వాళ్లం. ఊళ్లో ఏ అశుభం జరిగినా ఊరందరి చూపు మాలాంటి వాళ్ల ఇళ్ల వైపే ఉంటుంది. ఎప్పుడో ఊళ్లో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దానికి కారణం శ్యామలమ్మ మంత్రవిద్యేనని నెపం వేసి ఇప్పటికీ ఆమెపై దాడులు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు మేం బలయ్యాం' అంటోంది.

తెలియకుండా ఎలా ఉంటుంది?

ఇంత పెద్ద ఎత్తున సంఘటన జరిగితే ఊళ్లో ఉన్న సర్పంచ్‌కి లేదా మండల రెవిన్యూ అధికారి (ఎంఆర్‌ఒ)కి విషయం తెలియకుండా ఎలా ఉంటుంది? ఇలాంటి సందర్భాల్లో గ్రామ రాజకీయాలు కూడా కీలకంగా పనిచేస్తాయి. కోళ్లు చచ్చిపోయినా అణగారిన కులస్తులపై ఆధిపత్య కులాల వారు మంత్రవిద్య నెపంతో దాడి చేస్తారు. ఒక కుటుంబంలో ఒక వ్యక్తిపై నింద పడినప్పుడు మిగిలిన వ్యక్తులు తాము ఆ నేరంలో భాగం కాలేదని నిరూపించుకోవాలి. లేనిపక్షంలో వారంతా శిక్షార్హులే.. మూఢనమ్మకాల పేరుతో గ్రామాల్లో ఇలాంటి సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. స్థానిక పాలకులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తుంటారు.

- మురళీ కర్నమ్,
జాతీయ అకాడెమీ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్(ఎన్ఎఎల్ఎస్ఎఆర్) యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, హైద్రాబాద్.

సర్పంచ్ ఇంటి పక్కనే..

ఊరి సర్పంచ్ ఇంటి పక్కనే ఈ ఘటన జరిగింది. రోజంతా వాళ్లను అలా కొడుతున్నా అతడు దాడిని ఆపలేదు.

- అశోక్,
కుల వ్యతిరేక పోరాట సమితి (కెవిపిఎస్) సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు.

ఎందుకు రావడం లేదనీ కొట్టారు..

ఈ ఘటనకు దారితీసిన మరో విషయమేమంటే అమృత దంపతులు కొంతకాలంగా ప్రార్థనాలయానికి వెళ్లడం లేదు. వారికి ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు డౌన్‌సింద్రోమ్‌తో బాధపడుతోంది. 'ఒకరోజు ప్రార్థనాలయంలో మా పెద్ద పాప బట్టలు తడుపుకుంది. అప్పుడు చాలా ఇబ్బంది పడ్డాం. అది జరిగిన నాటినుండి మేం అక్కడికి వెళ్లడం లేదు. ఆ రోజు మమ్మల్ని చెట్టుకు కట్టేసి కొట్టినప్పుడు మేం ప్రార్థనాలయానికి ఎందుకు రావడం లేదని కూడా అడిగారు. మేం ఏం సమాధానం చెప్పగలం? మా పిల్ల విషయం బయటికి చెప్పలేం కదా? అవేమీ పట్టించుకోకుండా వాళ్లు మమ్మల్ని తిడుతూ పదే పదే కొట్టారు' అంటున్నాడు యాదయ్య.

పెద్దలంతా తప్పించుకున్నారు..

'ఆ రోజు దాడి చేసిన వారిలో కొంతమందిని అరెస్టు చేయలేదు. వారంతా పెద్ద కులస్తులు.. ఆ కారణంగానే ఎఫ్ఐఆర్‌లో వారి పేర్లను కూడా నమోదు చేయలేదు' అంటూ కలెక్టరు కార్యాలయంలో తాను చెప్పిన 8 మంది వ్యక్తులలో కొందరిపైనే కేసు నమోదైందని చెబుతున్నాడు యాదయ్య.

ఈ ఘటనలో దోషులెవరు.. నిర్దోషులెవరు.. అసలు ఈ పరిస్థితికి కారణమేంటి? మూఢనమ్మకాలపై ప్రజల్లో అవగాహన తేవడంతో పాటు పాలకులు, అధికారులు పటిష్ట చర్యలు చేపట్టకుంటే బాధితులకు న్యాయం జరగదు.

పదేళ్లలో 300 కేసులు..

జార్ఖండ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లోని మారుమూల గ్రామాల్లో ఇటువంటి సంఘటనలు జరిగినట్లు వార్తల్లో వింటుంటాం. కాని మన తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇటువంటి సంఘటనలు సర్వసాధారణం. గడిచిన పదేళ్లలో మంత్రగత్తెల నెపంతో దాడులు చేసినవి 300 కేసులు వెలుగు చూశాయి. వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయి. వెనుకబడిన తరగతులకు చెందిన కుటుంబాలు, మహిళలే ఈ దాడులకు కేంద్ర బిందువులుగా ఉంటారు. సమస్యను పరిష్కరించే పటిష్ట చట్టాలు లేనందున ఇటువంటి మూఢ నమ్మకాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కూడా ఇక్కడ కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

ప్రతి సంవత్సరం 20కి పైగా కేసులు తెలంగాణలో వెలుగు చూస్తున్నాయి. బాధితులంతా దళితులు, రజకులు, వడ్డెర కమ్యూనిటీకి చెందిన వారే ఉంటున్నారు. 2019లో వికారాబాద్‌కు చెందిన ఓ యువతి అనారోగ్య సమస్యతో బాధపడుతూ దాన్నుండి బయటపడాలంటే నిప్పుల్లో నడిస్తే సరిపోతుందని ఎవరో చెప్పారని అలాగే చేసింది. ఇలాంటి ఘటనలు ఎక్కడో ఒకచోట వినపడుతూనే ఉంటాయి. ఇలాంటి సంఘటనల్లో ఎవరికి వారే ప్రాణాల మీదికి తెచ్చుకోవడమో.. ఇతరుల ప్రాణాలు తీయడమో జరుగుతుంది. అలాగే మంత్రవిద్య చేస్తున్నారని నెపం వేసిన వారు తమ నిజాయతీనీ నిరూపించుకునేందుకు కఠిన పరీక్షలు ఎదుర్కొంటుంటారు. వాటిల్లో విఫలమైతే వారు నేరం చేసినట్లుగా పరిగణించి శిక్షలు అనుభవించాల్సిందేనని హుకుం జారీచేస్తారు. ఇక్కడ పోలీసులు, కోర్టులు, చట్టాలు ఏవీ పనిచేయవు. ప్రజలను అవగాహన పరిచేందుకు స్వచ్ఛంద సంస్థలు ఒకపక్క ప్రయత్నాలు చేస్తున్నా మరోపక్క ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. ఘటనలు జరిగినప్పుడు హడావిడి చేసే అధికారులు కొంత కాలానికి స్తబ్దత పాటిస్తారు.

మంత్ర విద్య చేస్తున్నారన్న ఒక్క అనుమానం ఆ ప్రజలను లక్ష్యం చేసుకోవడానికి సరిపోతుంది. మూఢనమ్మకాలను నిరోధించే ఎటువంటి చట్టం లేకుండా, ప్రభుత్వ జోక్యం లేకుండా ఈ సమస్యలు పరిష్కారమవ్వవు. స్వయం ప్రకటిత దేవుళ్ళను ప్రోత్సహించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోకపోతే సమస్య ఇంకా తీవ్రమవుతుంది.

- రమేష్‌బాబు,
జనవిజ్ఞాన వేదిక, తెలంగాణ

అమూల్ గర్ల్ రూపకర్త డాచున్హా మృతి



న్యూఢిల్లీ : అమూల్ గర్ల్ రూపకర్త, డాచున్హా కమ్యూనికేషన్స్ ఛైర్మన్ సిల్వెస్టర్ డాచున్హా మంగళవారం రాత్రి మృతి చెందారు. అట్టర్లీ-బట్టర్లీ ప్రచారంలో తొలిసారిగా అమూల్ గర్ల్ కార్టూన్‌ను డాచున్హా గీశారు. అప్పటి నుంచి దీనికి ఎంతో పేరు వచ్చింది. భారీ కటౌట్లు, వాల్ పోస్టర్ల రూపంలో ప్రదర్శించడంతో బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రకటనల సంస్థ 'ఎఎస్‌పి'లో మేనేజర్‌గా ఉన్న సమయంలో డాచున్హా ఈ బొమ్మ గీశారు. తరువాత ఆయన సొంతంగా డాచున్హా కమ్యూనికేషన్స్‌ను స్థాపించారు. సందర్భానుసారంగా పత్రికల్లో అమూల్ గర్ల్ కార్టూన్లు ఇవ్వడం డాచున్హా ప్రత్యేకత. పార్టీ, పత్నీ-వాహ్?, బ్రిటిష్ ఎయిర్‌వేస్, బోమ్ బై తదితర కార్టూన్లు కూడా విశేష ఆదరణ పొందాయి.

లోకమాన్య తిలక్‌లో మంటలు

చెన్నై: లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం ఒక్కసారిగా భారీ మంటలు చెలరేగాయి. చెన్నైలోని బేసిన్ బ్రిడ్జి సమీపంలో లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. రైలు కోచ్‌ల్లో నుంచి భయంతో ప్రయాణీకులు కిందకు పరుగులు తీశారు. సాయంత్రం 6 గంటలకు చెన్నై నుంచి ముంబైకి లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది.సాయంత్రం 6.48 గంటలకు చెన్నై బేసిన్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే రైలు ఇంజిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. హైఓల్టేజీ విద్యుత్ లైన్‌పై ఇంజిన్ రాపిడికి గురికావడంతో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. అప్రమత్తమైన లోకో పైలెట్ వెంటనే రైలును ఆపి వేయడంతో పెనుప్రమాదం తప్పింది.

పాలస్తీనా పట్టణంలోకి చొరబడ్డ ఇజ్రాయెలు

జెరూసలేం : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనా పట్టణంలోకి గురువారం వందలాదిమంది ఇజ్రాయిలీ సెటిలర్లు చొరబడి డజన్ల సంఖ్యలో ఇళ్ళను, కార్లను తగలబెట్టారు. పాలస్తీనా రెసిస్టెన్స్ ఫైటర్లు బుధవారం నలుగురు ఇజ్రాయెలీలను చంపినందుకు ప్రతీకారంగా ఈ దాడి జరిగినట్లు కనిపిస్తోంది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్ వ్యాప్తంగా అదనపు బలగాలను ఇజ్రాయిల్ మిలటరీ మోహరించిన నేపథ్యంలో సెటిలర్ల దాడి జరిగింది. పైగా పాలస్తీనా ఫైటర్ల కాల్పులకు ప్రతిస్పందనగా వెయ్యి కొత్త ఇళ్ళను నిర్మించాలని భావిస్తున్నట్లు ప్రధాని బెంజామిన్ నెతన్యాహు ప్రకటించారు. వెస్ట్‌బ్యాంక్‌లో రోజుల తరబడి పోరాటం సాగుతున్న నేపథ్యంలో ఈ చర్యలు, ప్రకటనలతో మరింత ఉద్రిక్తతలు పెరుగుతాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు 400 మంది సెటిలర్లు పట్టణంలోని ప్రధాన రహదారిపై ప్రదర్శన చేశారని, కార్లు, ఇళ్ళు, చెట్లకు నిప్పంటించారని టర్మస్ ఆయే పట్టణ వాసులు తెలిపారు. మొత్తంగా 30 ఇళ్లు, 60 కార్లు పూర్తిగా లేదా పాక్షికంగా తగలబడ్డాయని మేయర్ లాఫి అదీబ్ చెప్పారు. ఈ ఘర్షణల్లో 8 మంది పాలస్తీనియన్లు గాయపడ్డారు. ప్రతిఘటనలకు పట్టుకొమ్మగా వుండే జెనిన్ నగరంలో ఇజ్రాయెల్ బలగాలపై జరిగిన పోరులో ఏడుగురు పాలస్తీనియన్లు మరణించారు. ఆ మరుసటి రోజు ఎలి సెటిల్‌మెంట్‌లో కాల్పులు జరిగాయి. తాజాగా ఎలీలో వెయ్యి కొత్త ఇళ్ళను ప్రభు త్వం నిర్మిస్తుందని నెతన్యా హు ప్రకటించారు. ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన దాడుల్లో 130 మంది పాలస్తీనియన్లు మరణించగా, ఇజ్రాయెల్ వైపు 24 మంది చనిపోయారు.

పాలస్తీనాలోకి చొరబడిన ఇజ్రాయెల్ సెటిలర్లు తగులబెట్టిన వాహనాలు

పేదలకు భూ పంపిణీ చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వం పేదలకు భూ పంపిణీ చేస్తామని చెబుతున్న ప్రకటనను హర్షిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. గడిచిన పదేళ్లలో రాష్ట్రంలో పేదవాడికి ఒక్క సెంటు భూమి కూడా పంపిణీ చేయలేదని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం తీసుకున్న చర్యను స్వాగతిస్తున్నామని, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సుల మేరకు పేదలకు పంచడానికి అవకాశమున్న అన్ని రకాల భూములనూ గుర్తించి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పంపిణీ చేయాలని కోరారు. అసైన్డ్ భూముల్లో ఎబిసి వర్గీకరణ ద్వారా నిజమైన పేదలకు నష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. సి కేటగిరిలో నిర్ణయించిన లంక భూములు, సారవంతమైన భూములకు జిల్లా కలెక్టర్ సంతకం ద్వారా పట్టాలు, భూ పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిసిందని, రాజకీయ పలుకుబడి కలిగిన వారిని బినామీ పేర్లతో భూములను కబ్జా చేసే అవకాశం ఉందని తెలిపారు. అన్ని రకాల భూములను మండలాన్ని యూనిట్‌గా తీసుకుని అన్ని రాజకీ య, వ్యవసాయ కార్మిక సంఘాలను అసైన్‌మెంట్ కమిటీలో చేర్చి ఆ కమిటీ నిర్ణయం ద్వారా పేదల కు భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టండి : విజయసాయి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని వైసిపి శ్రేణులకు రాజ్యసభ సభ్యులు వి విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం పార్టీ పంచాయతీరాజ్, న్యాయ విభాగాల నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొన్ని సంస్థలు పెద్దయెత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా అబద్ధాలను నిజాలుగా ప్రచారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయపరంగా ఇలాంటి కుట్రలను సమర్థవంతంగా తిప్పి కొట్టాలన్నారు. గతంలో మాదిరిగానే ఎన్నికల సమయంలో వైసిపి అభ్యర్థుల నామినేషన్ దాఖలు చేసే పత్రాలు నుంచి ప్రతి విషయంలోనూ న్యాయవిభాగం సహాయ సహకారాలు అందించాలని కోరారు. వైఎస్సార్ లా నేస్తం పేరిట జూనియర్ న్యాయవాదులకు ప్రభుత్వం నెలకు రూ.5 వేలు స్టైఫండ్ ఇస్తోందన్నారు. సమావేశంలో న్యాయ విభాగ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాశ్మీర్‌కు రేషన్ తగ్గింపుపై తరిగామి ఆగ్రహం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌కు కేంద్ర ప్రభుత్వం రేషన్ సరఫరా తగ్గించడంపై సిపిఎం నాయకులు మహ్మద్ యూసుఫ్ తరిగామి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కేటాయింపులో గణనీయమైన తగ్గింపుతో ఈ ప్రాంత వినియోగదారుల్లో నిరాశను రేకెత్తించిందని అన్నారు. జమ్ముకాశ్మీర్ ఆహార హక్కు పథకం (జెకెఎఫ్ఐఎస్), ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పిఎంజికెఎవై)లను ఉపసంహరించుకున్న తరువాత రేషన్ కోటాను 50 శాతానికి పైగా కేంద్రం తగ్గించిందని తరిగామి విమర్శించారు. గతంలో పై పథకాల కింద వినియోగదారులకు 10 కేజీల రేషన్ లభించేందని, ప్రస్తుతం ప్రభుత్వం దీనిని 5 కేజీలకు తగ్గించి వినియోగదారులను ఇబ్బందులను గురి చేస్తుందని తెలిపారు. తీవ్రంగా ఉన్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం నేపథ్యంలో రేషన్ తగ్గింపు ప్రజల కష్టాలను మరింత పెంచిందని విమర్శించారు. జమ్ముకాశ్మీర్‌కు తగినంత రేషన్ సరఫరా జరిగేలా చూడాలని, ప్రతి ఇంటికి నెలవారీ సబ్సిడీ కోటాను పెంచాలని కేంద్రానికి తరిగామి విజ్ఞప్తి చేశారు.

వేదికల మార్పు కుదరదు: ఐసిసి, బిసిసిఐ

- షెడ్యూల్ ప్రకారమే వన్డే ప్రపంచకప్

దుబాయ్: షెడ్యూల్ ప్రకారమే వన్డే ప్రపంచ కప్ జరుగుతుందని, వేదికల మార్పు కుదరని అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి), భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) తాజాగా ప్రకటించాయి. పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు(పిసిబి) ప్రధానంగా రెండు మ్యాచ్‌ల వేదికలను మార్చాలంటూ ఐసిసికి లేఖ రాసింది. ఈ క్రమంలో గురువారం ఐసిసి, బిసిసిఐ సంయుక్తంగా ఓ ప్రకటనలో వేదికల్లో మార్పు లేదంటూ స్పష్టం చేశాయి. షెడ్యూల్ ప్రకారం పాక్ జట్టు ఆస్ట్రేలియాతో బెంగళూరులో, ఆఫ్ఘనిస్తాన్‌తో చెన్నైలో మ్యాచ్‌లను ఆడాల్సి ఉంది. చెన్నైలోని చెపాక్ స్టేడియం స్పిన్నర్లకు అనుకూలమని, బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం బ్యాటర్లకు స్వర్గధామమని దీంతో ఈ రెండు వేదికలను మార్చాలంటూ పాక్ ఐసిసి లేఖను రాసింది. ఈ నేపథ్యంలో ఐసిసి నిబంధనల ప్రకారం చూసుకుంటే వేదికలు నిర్ణయించే హక్కు ఆతిథ్య దేశానికి ఉంటుంది. వేదికలు మార్చాలంటే ఐసిసి ఆమోదం తప్పనిసరి. అయితే ఐసిసి సరైన కారణం లేకుండా వేదికలు మార్చడానికి అంగీకరించదు. ఏవైనా భద్రతా కారణాలు ఉంటేనే వేదికలు మార్చాలంటుంది. మరే ఇతర కారణాలకూ దాదాపు మార్చరు. ఈ క్రమంలోనే పాకిస్తాన్ వద్ద సరైన కారణం ఏదీ లేదని, అలాంటప్పుడు వేదికలు మార్చడం కుదరదని ఐసిసి పేర్కొంది. ఇదే విషయాన్ని పిసిబికి కూడా అధికారికంగా తెలియజేసింది. దీంతో భారత్-పాక్ జట్లమధ్య అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగే మ్యాచ్‌కూ లైన్ క్లియరైంది. ఆ మ్యాచ్‌పై ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఐసిసి తాజాగా ప్రకటించింది. అలాగా వేదిక మార్చాలనే పాకిస్తాన్ అభ్యర్థనను ఐసిసి కొట్టివేస్తున్నట్లు పేర్కొంది. గతంలో 2016 టి20 వరల్డ్ కప్‌లో భారత్, పాకిస్తాన్ మ్యాచ్ వేదికను భద్రతా కారణాల దృష్ట్యా మార్చారు. ధర్మశాలలో జరగాల్సిన మ్యాచ్‌ను కోల్‌కత్తాకు మార్చామని ఐసిసి ఆ ప్రకటనలో తెలిపింది.

ప్రతిష్టాత్మకంగా ఆటల పోటీలు

'ఆడుదాం ఆంధ్రా'పై సిఎం సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చక్కటి క్రీడా స్ఫూర్తిని నింపేలా రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆటల పోటీలు నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఆడుదాం ఆంధ్రా పేరుతో నిర్వహించనున్న క్రీడా సంబరాలపై తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సిఎం గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీయడానికి క్రీడా సంబరాలు ఉపయోగపడాలన్నారు. పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలన్నారు. రాష్ట్రంలో ప్రముఖ క్రీడాకారులందరూ ఇందులో భాగస్వామ్యం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో క్రికెట్ సహా ఇతర క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖపట్నంలో మరో అత్యాధునిక క్రికెట్ స్టేడియం దిశగా అడుగులు వేయాలని, సాకారం అయ్యాక ప్రస్తుతం ఉన్న స్టేడియాన్ని క్రీడలకు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా తీర్చిదిద్దే దిశగా ముందడుగు వేయాలని సిఎం ఆదేశించారు. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి చెన్నై సూపర్ కింగ్స్ ముందుకు వచ్చిందని, కడప, తిరుపతి, మంగళగిరి, విశాఖపట్నంలో క్రికెట్ అకాడమీల ఏర్పాటు దిశగా ముందుకు సాగాలని సిఎం సూచించారు. ఈ సమావేశంలో సిఎస్ జవహర్‌రెడ్డి, క్రీడలు, యువజన సర్వీసులశాఖ ముఖ్య కార్యదర్శి వాణీమోహన్, ఆర్థికశాఖ కార్యదర్శి గుల్జార్, శాప్ ఛైర్మన్ సిద్ధార్థ్‌రెడ్డి, విసి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

క్వార్టర్స్‌కు ప్రణయ్

తైపీ ఓపెన్

తైపీ: తైపీ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ సత్తాచాటాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లో టామీ సుగిర్తోను ఓడించి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లా డు. ఏకపక్షంగా సాగిన ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో ప్రణయ్ రాయ్ 21-9, 21-17 తేడాతో ఇండోనేషియా ఆటగాడు టామీ సుగిర్తోపై సునాయాసంగా నెగ్గాడు. ఈ మ్యాచ్ కేవలం 36 నిమిషాల్లోనే ముగిసింది. క్వార్టర్స్‌లో ప్రణయ్.. ఐదో ర్యాంకర్ అగస నకాలాంగ్‌తో తలపడనున్నాడు. మరో ప్రి క్వార్టర్‌లో పారు పల్లి కశ్యప్ 16-21, 17-21తో సు-లీ-యంగ్(తైపీ) చేతిలో, మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి ఒడ్డి-రోహన్ కపూర్ 13-21, 18-21తేడాతో చియు హ్సియాంగ్-లిన్ షియో(తైపీ) చేతిలో ఓడారు.

శాఫ్ ఫుట్‌బాల్ టోర్నీలో భాగంగా భారత్-పాక్ జట్ల మధ్య బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా ఆటగాళ్లు ఓ దశలో బాహాబాహీకి సిద్ధమయ్యారు. పాక్ ఆటగాడు బంతిని విసరబోతుండగా.. భారత కోచ్ ఇగార్ స్టిమాక్ చేత్తో వెనుక నుంచి దాన్ని నెట్టేశాడు. దీంతో రెఫరీ అతడికి రెడ్ కార్డు చూపించాడు. ఆ తర్వాత భారత్, పాక్ ఆటగాళ్లు పరస్పరం వాదించుకుంటూ.. ఒకరినొకరు నెట్టుకొంటూ వాగ్వాదానికి దిగారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68